

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్

8 పేజీలు | బుధవారం | నవంబర్ 22, 2023 | www.navatelangana.com



కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రెవెన్యూ డివిజన్‌గా బోథ్

- బోథ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆడే గజేందర్
- బోథ్ మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం

2లో...



ఆసిఫాబాద్ జిల్లాలో ఐటీ దాడుల కలకలం

- ఆసిఫాబాద్, కాగజ్‌నగర్‌లో ఏకకాలంలో దాడులు
- ప్రముఖ వ్యాపారులు కాసం శ్రీనివాస్, రఫీక్ ఇళ్లలో సోదాలు

5లో...

ఆదిలాబాద్‌షా ఎవరు..?

- హోరాహోరీగా తలపడుతున్న ప్రధాన పార్టీలు
- బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీల మధ్య తీవ్ర పోటీ
- ప్రభావం చూపించనున్న స్వతంత్ర అభ్యర్థులు
- ఆదిలాబాద్‌లో రసవత్తరంగా ఎన్నికల సమరం

ఆదిలాబాద్‌లో ఎన్నికల సమరం రసవత్తరంగా మారుతోంది. మూడు ప్రధాన పార్టీల మధ్య త్రిముఖ పోటీ నెలకొంది. ప్రధాన పార్టీలు నువ్వా-నేనా అనే రీతిలో తలపడుతున్నాయి. ఒకరిద్దరు స్వతంత్ర అభ్యర్థులతో పాటు రిజిస్ట్రేషన్ కలిగిన పార్టీల నుంచి బరిలో నిలిచిన వారిలో కొందరు సైతం తాజా ఎన్నికల్లో ప్రభావం చూపించే అవకాశం కనిపిస్తోంది. మరో తొమ్మిది రోజుల్లో పోలింగ్ జరగనుండటంతో ఆయా పార్టీలు, స్వతంత్రులు ప్రచారాన్ని మరింత ముమ్మరం చేశాయి. ఎవరికి వారు సొంత సర్వేలు చేయిస్తూ నియోజకవర్గంలో పరిస్థితిని అంచనా వేసుకుంటున్నారు. ఎక్కడ తగ్గినట్లు కనిపించినా..అక్కడికి వెళ్లి బలోపేతం దిశగా కృషి చేస్తున్నారు. ఆదిలాబాద్ నియోజకవర్గంలో అధికార బీఆర్ఎస్‌తో పాటు ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీ సైతం అదే హోరాహోరీగా తలపడుతుండటంతో చివరికి గెలుపు ఎవరికి దక్కుతుందనే చర్చ జోరుగా సాగుతోంది.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఆదిలాబాద్ నియోజకవర్గ ఎన్నికల సమరం హాట్‌టాపిక్‌గా మారుతోంది. ఇక్కడ త్రిముఖ పోటీ ఉండటంతో ఎవరు గెలుస్తారనేదానిపై తీవ్ర ఉత్కంఠ రేకెత్తిస్తోంది. తెలంగాణ ఆవిర్భావం నుంచి బీఆర్ఎస్ ఆధిపత్యం కొనసాగుతుండగా.. తొలిసారి గెలిచి పాగా వేసేందుకు కాంగ్రెస్, బీజేపీలు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయి. వీరితో పాటు కాంగ్రెస్ టికెట్ మిగతా..2లో...

తొలిసారి బరి..కలిసొచ్చేనా మరి..?

- స్వతంత్ర అభ్యర్థి సంజీవ్‌రెడ్డి ముమ్మర ప్రచారం
- సీఆర్ఆర్ ఓటు బ్యాంకు కలిసి వస్తుందని ధీమా
- వెంట నడుస్తున్న సీనియర్ నాయకులు, పార్టీ క్యాడర్





నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఆదిలాబాద్ అసెంబ్లీ బరిలో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచిన అల్లూరి సంజీవ్‌రెడ్డి ప్రచారాన్ని ముమ్మరం చేశారు. దివంగత మాజీ మంత్రి రాంచంద్రారెడ్డి వారసుడిగా ఎన్నికల బరిలో నిలిచిన ఆయన గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో సీఆర్ఆర్‌కు ఉన్న ఓటు బ్యాంకు తనకు కలిసి వస్తుందని భావిస్తున్నారు. కాంగ్రెస్ టికెట్ కోసం చివరి వరకు తీవ్రంగా ప్రయత్నం చేసినప్పటికీ నిరాశ ఎదురైంది. కొత్తగా పార్టీలో చేరిన ఎన్ఆర్ఐ కంది శ్రీనివాస్‌రెడ్డికి పార్టీ టికెట్ కేటాయించింది. దీంతో మిగతా..2లో...

వివేక్ ఇంట్లో ఐటీ సోదాలు

నవతెలంగాణ-హాజీపూర్

మాజీ ఎంపీ, చెన్నూర్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వివేక్ వెంకటస్వామి నివాసంలో ఐటి సోదాలు జరిగాయి. మంచిర్యాలలోని హైటెక్ కాలనీలో వివేక్ ఇంట్లో మంగళవారం ఉదయం 5గంటలకు ఐటీ అధికారులు చేరుకొని విచారణ చేపట్టారు. కొన్ని రోజుల నుండి వివేక్‌కు చెందిన కంపెనీల డబ్బును చెన్నూర్ నియోజకవర్గంలో ఓటర్లకు పంచేందుకు తరలిస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో ఐటీ సోదాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. నాయకులు, అనుచరులు వివేక్ ఇంటికి చేరుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్నారు. రెండు రోజుల క్రితం బాల్క సుమన్ హైదరాబాద్‌కు వెళ్లి ఐటీ దాడులకు ప్లాన్ చేశారని వివేక్ అనుచరులు విమర్శిస్తున్నారు. ఉదయం నుండి రాత్రి వరకు సోదాలు జరుగుతుండడంతో పార్టీ శ్రేణులు ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నారు. వివేక్ సోదరుడు బెల్లంపల్లి కాంగ్రెస్ అభ్యర్థి వినోద్ ఇంట్లో కూడా ఐటీ అధికారులు సోదాలు జరిపారు. దీంతో కాంగ్రెస్ శ్రేణులు జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఆందోళనలకు దిగొచ్చిన ప్రభుత్వం తూతూ మంత్రంగా సిర్పూర్ బీఆర్ఎస్ అభ్యర్థి అనుచరుల ఇంట్లో సోదాలు చేస్తున్నారని విమర్శలు చేస్తున్నారు. ఇవి బీఆర్ఎస్, బీజేపీ ఆడుతున్న డ్రామాలు అని నిరసన తెలియజేశారు. కక్షపూరిత దాడులతో బీజేపీ, బీఆర్ఎస్ మూల్యం చెల్లించక తప్పదని కాంగ్రెస్ పార్టీ నాయకులు హెచ్చరిస్తున్నారు. ఉదయం నుండి సాయంత్రం 8గంటల వరకు ఐటీ అధికారులు వివేక్ ఇంటిని నిర్బంధించి సోదాలు జరుపుతున్నారు. వివేక్ బయటకు వస్తే కానీ వివరాలు తెలిసే అవకాశం లేదు.



తొలిసారి బరి..కలిసొచ్చేనా మరి..?

(మొదటి పేజీ తరువాయి)

అసంతృప్తికి గురైన సంజీవరెడ్డి ఎన్నికల బరిలో నిలవాలని భావించారు. ఈయనకు టికెట్ ఆశించిన మరో ఇద్దరు సీనియర్ నాయకులు గండ్రత్ సుజాత, సాజిద్‌ఖాన్‌లు సైతం మద్ధతు తెలుపడంతో స్వతంత్ర అభ్యర్థిగా పోటీలో నిలిచారు. ప్రస్తుతం నియోజకవర్గ వ్యాప్తంగా విస్తృతంగా పర్యటిస్తూ ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు.

విజయంపై ధీమా..!

తొలిసారి ఆదిలాబాద్ అసెంబ్లీ బరిలో నిలిచిన సంజీవరెడ్డి ఎన్నికల్లో విజయంపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. దివంగత మాజీ రాంచంద్రారెడ్డి అల్లుడిగా నియోజకవర్గ వ్యాప్తంగా గుర్తింపు ఉండటం.. ఆయన చేసిన అనేక అభివృద్ధి పనులను ఇప్పటికీ జనం గుర్తు చేసుకుంటారు. మంత్రిగా, ఎమ్మెల్యేగా సీఆర్ఆర్ అందించిన సేవలకు జనం గుండెల్లో నిలిచిపోయారు. నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో సీఆర్ఆర్ అభిమానులు ఉంటంతో ఆ ఓటు బ్యాంకు తనకు కలిసి వస్తుందని సంజీవరెడ్డి ధీమాతో ఉన్నారు. మరోపక్క అప్పట్లో ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ ఛైర్మెన్‌గా నిజాయితీగా పనిచేశారని రైతుల్లోనూ ఆయన పట్ల సానుకూల వైఖరి కనిపిస్తోంది. మరోపక్క గత ఎన్నికల్లో పోటీచేసి ఓడిపోయిన గండ్రత్ సుజాత, పార్టీ జిల్లా అధ్యక్షుడు సాజిద్‌ఖాన్‌లు కాంగ్రెస్‌కు రాజీనామా చేసి సంజీవరెడ్డికి మద్ధతుగా నిలిచారు. ప్రస్తుత ఎన్నికల ప్రచారంలో ఆయనతో పాటు విస్తృతంగా పర్యటిస్తూ గెలుపు కోసం కృషిచేస్తున్నారు. ఈ తరుణంలో గ్రామాల్లో పార్టీకి చెందిన అధికశాతం క్యాడర్ వీరి వెంటనే నడుస్తోందనే ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో కాంగ్రెస్‌లో భారీగా ఓట్లు చీలిపోతాయనే భావన వ్యక్తమవుతున్నప్పటికీ అధికభాగం సంజీవరెడ్డి వైపు వెళ్తాయనే అభిప్రాయం వ్యక్తం కావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

ఆదిలా'బాద్‌షా' ఎవరు..?

(మొదటి పేజీ తరువాయి)

ఆశించి భంగపడిన అల్లూరి సంజీవ్‌రెడ్డి స్వతంత్రంగా బరిలో నిలవడంతో పోటీ మరింత రసవత్తరంగా మారుతోంది. ఒక దఫా టీడీపీ నుంచి మరో మూడు సార్లు బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా కొనసాగుతున్న జోగు రామన్న ఐదో సారి విజయం సాధించేందుకు తాజా ఎన్నికల బరిలో నిలిచారు. ఇప్పటికే ప్రచారాన్ని ముమ్మరం చేసిన ఆయన గెలుపుపై ధీమాతో ఉన్నారు. అన్ని గ్రామాల్లో పార్టీ క్యాడర్ బలంగా ఉండటం.. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు తాజాగా బీఆర్ఎస్ ప్రవేశపెట్టిన మేనిఫెస్టోలోని అంశాలు, నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులు మరోసారి విజయానికి దోహదం చేయనున్నాయని ప్రచారం జరుగుతోంది. మరోపక్క ప్రభుత్వ వ్యతిరేకత, కొందరు నాయకులు పార్టీ మారడం, మరి కొందరు ద్వితీయ స్థాయి నాయకులు పార్టీ పట్ల అసంతృప్తితో ఉండటం వంటి అంశాలు ప్రతికూలంగా మారే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇక కాంగ్రెస్ నుంచి బరిలో నిలిచిన ఎన్ఆర్ఐ కంది శ్రీనివాస్‌రెడ్డి సైతం గెలుపుపై ధీమాతో ఉన్నారు. కాంగ్రెస్‌లో సీనియర్లను కాదని టికెట్ దక్కించుకున్న ఆయన విజయం కోసం తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఇది వరకు నియోజకవర్గంలో చేపట్టిన సేవా కార్యక్రమాలతో పాటు పార్టీపై ప్రజల్లో సానుకూల వైఖరి ఉందని, రాష్ట్రవ్యాప్తంగా పార్టీ గాలివీస్తోందని ప్రచారం విజయం సాధించేందుకు దోహదం చేస్తుందని నమ్ముతున్నారు. మరోపక్క ఎన్నికల్లో టికెట్ ఆశించిన పార్టీ సీనియర్ నాయకులు కందికి మద్దతు తెలుపకపోవడంతో పాటు గ్రామాల్లో క్షేత్ర స్థాయి పార్టీ క్యాడర్‌ను సైతం అంతగా పట్టించుకోకవడంతో వారు పార్టీ కోసం పనిచేయడం కష్టమనే భావన వ్యక్తమవుతుండటం ఎన్నికల్లో ప్రతికూలంగా మారే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతోంది. ఇక బీజేపీ అభ్యర్థి పాయల్ శంకర్ సైతం విజయంపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. పార్టీకి సాంప్రదాయ ఓటు బ్యాంకు ఉండటంతో పాటు మూడు సార్లు పోటీ చేసి ఓడిపోయిన సానుభూతి ఈ ఎన్నికల్లో కలిసి వస్తుందని నమ్ముతున్నారు. మరోపక్క ప్రత్యర్థి పార్టీలు బలంగా ఉండటం.. పార్టీ మేనిఫెస్టోలోనూ ప్రజలను ఆకర్షించే అంశాలు అంతగా లేకపోవడం ప్రతికూలంగా మారే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

స్వతంత్రుల ప్రభావం ఎంత..?

ఆదిలాబాద్ నియోజకవర్గంలో ఎన్నికల బరిలో నిలిచేందుకు 30మంది నామినేషన్లు వేయగా ముగ్గురివి తిరస్కరణకు గురయ్యాయి. మరో ఇద్దరు అభ్యర్థులు ఉపసంహరించుకోగా 25మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ఇందులో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీతో పాటు మరో తొమ్మిది మంది రిజిస్ట్రేషన్ కలిగిన పార్టీల తరపున, మిగతా 13మంది అభ్యర్థులు స్వతంత్రంగా బరిలో నిలిచారు. ఇందులో కాంగ్రెస్ టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నించి దక్కకపోవడంతో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచిన అల్లూరి సంజీవరెడ్డి తాజా ఎన్నికల్లో ఎంత మేరకు ప్రభావం చూపుతారోనని సర్వత్రా ఆసక్తి నెలకొంది. దివంగత మాజీ మంత్రి రాంచంద్రారెడ్డికి ప్రజల్లో ఉన్న అభిమానం కారణంగా గణనీయమైన ఓట్లు రాబడుతారనే ప్రచారం జరుగుతోంది. మరోపక్క క్షేత్రస్థాయి కాంగ్రెస్ క్యాడర్ అధిక శాతం వీరి వెంటే ఉందనే ప్రచారంతో తాజా ఎన్నికల్లో ప్రభావం చూపిస్తారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోపక్క కాంగ్రెస్ సీనియర్ నాయకుడిగా గుర్తింపు ఉన్నా.. పార్టీ గుర్తు లేకపోవడం ప్రతికూలంగా మారే అవకాశం ఉందని తెలుస్తోంది. వీరితో పాటు ధర్మసమాజ్ పార్టీ నుంచి బరిలో నిలిచిన అగ్గిమల్ల గణేష్ సైతం ఎన్నికల్లో ఆయా సామాజిక వర్గాల ఓట్లను సాధించే అవకాశం ఉందని తెలుస్తోంది. వివిధ పార్టీలు, స్వతంత్రులుగా బరిలో నిలిచిన మరికొందరు అభ్యర్థులు సైతం వేలల్లో ఓట్లు సాధించే అవకాశం ఉంటుంది. దీంతో వీరు ఏ పార్టీకి వచ్చే ఓట్లు చీల్చుతారోననే ఆందోళన అభ్యర్థుల్లో సర్వత్రా వ్యక్తమవుతోంది. చివరకు చీలిక ఓట్లు ఎవరికి లాభం చేకూరుస్తాయో..ఎవరి ఓటమికి కారణమవుతాయోననే ఉత్కంఠ నెలకొంది.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రెవెన్యూ డివిజన్‌గా బోథ్

నవతెలంగాణ-బోథ్

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే బోథ్‌ను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడే గజేందర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోనియా 60 సంవత్సరాల కలను నెరవేర్చి తెలంగాణ ఇచ్చారని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే బోథ్ పట్టణాన్ని రెవెన్యూ డివిజన్‌గా ప్రకటిస్తామని హామీ ఇచ్చారు. అలాగే బోథ్‌లో డిగ్రీ కాలేజ్, అగ్నిమాపక కేంద్రంతో పాటు కుప్టి ప్రాజెక్ట్ నిర్మిస్తామని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, మండల ప్రధాన కార్యదర్శి రాజు రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్, మైనారిటీ అసెంబ్లీ ప్రెసిడెంట్ షేక్ నజర్, నాయకులు ఇంద్రారెడ్డి, శేఖర్, మహేందర్, గంగారెడ్డి పాల్గొన్నారు.

సూక్ష్మ పరిశీలకుల ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా జిల్లాలో ఎన్నికల నిర్వహణ కొరకు సూక్ష్మ పరిశీలకుల ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బోర్కడే హేమంత్ అన్నారు. మంగళవారం ఎన్నికల సాధారణ పరిశీలకులు రాహుల్ మహివాల్, పోలీస్ పరిశీలకులు డికె.చౌదరి, ఎస్పీ సురేష్‌కుమార్‌తో కలిసి సూక్ష్మ పరిశీలకుల ర్యాండమైజేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ సిర్పూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాలలో ఈ నెల 30న జరగనున్న పోలింగ్ సందర్భంగా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పూర్తిస్థాయి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలో సిర్పూర్ నియోజకవర్గంలోని 42 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలకు 43 మంది, ఆసిఫాబాద్ నియోజకవర్గంలోని 39 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలకు 39 మంది నియమించడం జరిగిందని తెలిపారు. పోలింగ్ రోజున సూక్ష్మ పరిశీలకులు వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ ప్రక్రియ తీరును నివేదిక రూపంలో అందిస్తారని తెలిపారు. ఎన్నికల విధులు కేటాయించబడిన అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

భూవివాదాలే హత్యకు కారణం

నవతెలంగాణ-బేల

హత్య మిస్టరీని పోలీసులు చేధించారు. వారం రోజుల క్రితం 14న మండలంలోని కరోని గ్రామ సమీపంలో అదే గ్రామాణికి చెందిన తొడసం బండును గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. కొన్ని ఆధారాలతో నిందితులను పట్టుకున్నట్లు సిఐ కోల నరేష్ కుమార్ తెలిపారు. హత్యకు భూ వివాదాలే కారణమని, వరుసకు తమ్ముడయ్యే కొచాడే రాజు అదే గ్రామానికి చెందిన పెందూర్ సంజయ్‌తో కలిసి తొడసం బండును హత్య చేశాడు. 14న మంగళవారం రాత్రి 10గంటల సమయంలో తొడసం బండు గ్రామ సమీపంలో వంతెన వద్ద కూర్చొని ఉన్న విషయాన్ని గ్రహించిన రాజు ఇంటి వద్ద ఉన్న కత్తి తీసుకొని వచ్చి మిత్రుడైన పెందూర్ సంజయ్‌తో కలిసి రెండు సార్లు గొంతు కోసి హత్య చేశారని సీఐ తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ, ఎస్ఐ రాధిక తెలిపారు.

పోలింగ్ సక్రమంగా జరిగేలా చర్యలు చేపట్టాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

శాసనసభ ఎన్నికల పోలింగ్ సక్రమంగా జరిగే విధంగా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ అన్నారు. రాష్ట్ర శాసనసభకు జరగబోయే సాధారణ ఎన్నికల ఏర్పాట్లపై మంగళవారం హైదరాబాద్ నుండి సంయుక్త ప్రధాన ఎన్నికల అధికారి సర్ఫరాజ్ అహ్మద్, రాష్ట్ర ఉన్నత స్థాయి అధికారులతో కలిసి జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ పోలింగ్ రోజు అత్యవసర సేవలు కింద విధులు నిర్వహించే ఓటర్లు తమ ఓటు హక్కు ముందస్తుగా వినియోగించుకునేందుకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించిందని, దరఖాస్తు చేసుకున్న ఓటర్ల కోసం రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఫెసిలిటేషన్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని అన్నారు. ఇంటి నుంచి ఓటు హక్కు వినియోగించుకునే ఓటర్ల జాబితా వివరాలను నియోజకవర్గ పరిధిలో పోటీ చేసే అభ్యర్థులకు తప్పనిసరిగా అందజేయాలని అన్నారు. పట్టణ ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల్లో వంద శాతం, గ్రామీణ ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలలో 60 శాతం వెబ్ క్యాస్టింగ్ చేయాలని, మిగిలిన పోలింగ్ కేంద్రాల బయట సిసి కెమేరాలు ఏర్పాటు చేయాలని అన్నారు. నూతన ఓటర్లకు ఓటరు గుర్తింపు కార్డుల పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఈవిఎం యంత్రాల ర్యాండమైజేషన్ పూర్తి చేసి, ఈవిఎం కమిషనింగ్ ప్రక్రియ ప్రారంభించాలని అన్నారు. ఎన్నికల ప్రచారం సంబంధించి సమావేశాలు, సభలు నిర్వహించుకునేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధుల, అభ్యర్థుల నుంచి వచ్చే దరఖాస్తులకు ఎప్పటికప్పుడు సకాలంలో అనుమతులు మంజూరు చేయాలని అన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అన్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ పిఎస్ మాట్లాడుతూ జిల్లాలో ఓటరు గుర్తింపు కార్డులు, ఓటరు సమాచార స్లిప్పులు త్వరితగతిన పంపిణీ చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఖుష్బుగుప్త, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.



కాంగ్రెస్‌తోనే సుపరిపాలన

నవతెలంగాణ-సారంగాపూర్

కాంగ్రెస్ పార్టీతోనే సుపరిపాలన సాధ్యమని పార్టీ నాయకులు రాజురెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో గడపగడపకు కాంగ్రెస్ ఎన్నికల ప్రచారం నిర్వహించి ఆరు గ్యారంటీ పథకాలను ఓటర్లకు వివరంగా వివరించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్ అందించడం జరిగిందని గుర్తు చేశారు. ఈ ఎనికల్లో కాంగ్రెస్ అభ్యర్థి శ్రీహరిరావును అధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పోతన్న, భోజన్న, ఎస్‌కె సలీం, భీమ్‌రావు, భూమన్న పాల్గొన్నారు.

బీఎస్పీతోనే బడుగు బలహీన వర్గాల అభివృద్ధి సాధ్యం

బీఎస్పీ అభ్యర్థి డాక్టర్ దాసారపు శ్రీనివాస్



నవతెలంగాణ-జైపూర్

బడుగు బలహీన వర్గాల అభివృద్ధి బీఎస్పీతోనే సాధ్యమని ఆ పార్టీ చెన్నూర్ నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ దాసారపు శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలో ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటి చేస్తున్న బాల్క సుమన్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గడ్డం వివేక్ ఇద్దరు కూడా స్థానికేతరులే అన్నారు. అంతేకాకుండా ఈ ఇద్దరు కూడావేల కోట్లకు అధిపతులని పేర్కొన్నారు. నియోజకవర్గంలో గెలిచి ఆర్థికంగా ఎదగడం తప్ప ప్రజలకు ఏ విధంగా కూడా సేవ చేయరని అన్నారు. హైదరాబాద్ నుండి పరిపాలన కొనసాగించే ఈ ఇద్దరికి ఓటు వేయకుండా స్థానికుడినైన మందమర్రికి చెందిన తనను గెలిపించాలని అభ్యర్థించారు. వృత్తి రీత్యా డాక్టర్ అయిన తాను గతంలో ఈ ప్రాంత వాసులకు వైద్యునిగా అనేక విధాలుగా సేవలందించానని గుర్తు చేశారు. ప్రజ సేవకు అంకితమై పని చేద్దామని ఆశించి బీఎస్పీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో స్థానికేతరులను పక్కన పెట్టి బీఎస్పీ గుర్తు ఏనుగుకు ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఇందారం, టేకుమట్ల, గంగిపల్లి, ఎల్కంటి, పెగడపల్లి, జైపూర్ మీదుగా రోడ్‌షో సాగింది. ఆయన వెంట బీఎస్పీ జిల్లా అధ్యక్షులు గుణ, మండల పార్టీ నాయకులు ఉన్నారు.

గుడుంబా రవాణా, విక్రయం చేపడితే చర్యలు

నవతెలంగాణ-కడెం

నిషేధిత గుడుంబా, తయారు, రవాణ, విక్రయాలు చేపట్టిన కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ ఎస్సై రాయబారపు రవికుమార్ హెచ్చరించారు. మంగళవారం మధ్యాహ్నం మండలంలోని చిన్న బెల్లాల్, పాండ్వాపూర్ గ్రామాల సరిహద్దు ప్రాంతాల్లో ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నిషేధిత గుడుంబా విక్రయాలు చేపడుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకొని నలుగురుపై కేసులు నమోదు చేసి వారి వద్ద నుంచి 22 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకొని, 1800 లీటర్ల గుడుంబా తయారీకై పులియపెట్టిన బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై వెల్లడించారు. ఈ తనిఖీల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ గంగారెడ్డి, ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది, ఇంతియాజ్ అశ్వక్, సాయి ప్రసాద్, నరేందర్, ముత్యం, జమీర్, గౌతమ్, వెంకటేష్, భాస్కర్, తేజ పాల్గొన్నారు.

ఇంటింటికి ప్రచారంలో బీఆర్ఎస్ నాయకులు



నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

పట్టణంలో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటికీ ప్రచారం చేశారు. మంగళవారం స్థానిక సుభాష్‌నగర్‌లో ఇంటింటా తిరుగుతూ కారుగుర్తుకు ఓటువేసి మూడోసారి ముఖ్యమంత్రిగా కేసీఆర్‌ను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ ప్రచారంలో బీఆర్ఎస్ నాయకులు మున్సిపల్ చైర్మెన్ రాజేంధర్, రాము నాయక్, కే.సురేష్, చింటు, నిమ్మల శ్రీను పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గెలువు ఖాయం

నవతెలంగాణ-లక్ష్మణచాంద

బీఆర్ఎస్ నిర్మల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి గెలువు ఖాయమని డీసీసీబీ వైస్ చైర్మెన్ ఎర్ర రఘునందన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని పొట్టపల్లి(కే) గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ కారు గుర్తుకే ఓటేసి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. అభివృద్ధిని చూసి ఓటువేయాలని విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. మునుపెన్నాడు లేనివిధంగా సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంగం వెంకట రాజు, ఉల్వాజీ రాజు, చిన్నరెడ్డి, రవీందర్, సురేష్, నరేష్, పోతుంగంటి సాయన్న, రమేష్, సాయి కుమార్, మహేష్, నాగుల రాజు, జడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా కృషి చేయాలి

నవతెలంగాణ-కడెం

కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని కాంగ్రెస్ పట్టణాధ్యక్షులు వాజీద్ అన్నారు. మంగళవారం స్థానిక నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖానాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వెడ్మ బొజ్జు పటేల్‌ని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టి.రమేష్, రహీం, బ్రహ్మాచారి, భూషణం, బబ్లు, ఇస్రు కార్యకర్తలు పాల్గొన్నారు.

తోకల తిరుపతి అకాల మరణం

విప్లవోద్యమానికి తీరని నష్టం



నవతెలంగాణ-కడెం

తోకల తిరుపతి అకాల మరణం విప్లవోద్యమానికి తీరని నష్టమని ఐఎఫ్‌టీయూ నిర్మల్ జిల్లా అధ్యక్షులు సునారికారి రాజేష్ అన్నారు. మంగళవారం కడెం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తోకల తిరుపతి నిరుపేద కుటుంబంలో పుట్టి మండల జిల్లా రాష్ట్రస్థాయిలో అనేక ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్నారని తెలిపారు. గత రాత్రి మంచిర్యాల జిల్లా ఇందారం క్రాస్‌రోడ్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందడం విప్లవోద్యమాలకు తీరని లోటని అన్నారు. తిరుపతికి విప్లవ జోహార్లను తెలిపి వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దుర్గం లింగన్న పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పాలనలోనే మండలాభివృద్ధి



నవతెలంగాణ-కుభీర్

బీఆర్ఎస్ పాలనలోనే ముధోల్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయడం జరిగిందని ముధోల్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి గడ్డిగారి విఠల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని మలేగాం, కుప్టి, వర్ని, పల్సి, కాస్రా, చోండి గ్రామంలో అసెంబ్లీ ఎన్నికల ప్రచారం జోరుగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి మాట్లాడుతూ గత 60ఏండ్లుగా పాలించిన కాంగ్రెస్ పార్టీ ముధోల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిందేమీ లేదని విమర్శించారు. కేవలం బీఆర్ఎస్ ప్రభుత్వం తోనే నియోజకవర్గంలోని అన్ని మండలాలు గ్రామాలు ఎంతో అభివృద్ధి చెందడం జరిగిందని అన్నారు. ఎలక్షన్లు వచ్చినప్పుడే కాంగ్రెస్, బీజేపీ నాయకులకు ప్రజలు, గ్రామాలు గుర్తుకు వస్తాయని అన్నారు. అదే విధంగా గ్రామంలో ఉన్న పెన్షన్లు మరింతగా పెంచేందుకు కేసీఆర్ కృషి చేస్తున్నారని అన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణ ప్రభుత్వం రూ.వేల వరకు పెన్షన్లు అందించడంతో పాటు రైతులకు రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మీ, షాదీముబారక్, డబుల్ బెడ్ రూమ్, దళితబంధు, తదితర పథకాలు ప్రజలకు అందించేందుకు ముఖ్యమంత్రి ఎంతో కృషి చేయడం జరుగుతుందని అన్నారు. మరోసారి అవకాశం ఇచ్చి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచేందుకు కృషి చేయడం జరుగుతుందని అన్నారు. గ్రామంలో ఉన్న ప్రతి ఒక్కరు కారు గుర్తుకు ఓటు వేసి గెల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మెన్ గంగాచరణ్ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎన్నిల అనిల్, బీఆర్ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తూము రాజేశ్వర్, వైస్ ఎంపీపీ మోహియోద్దీన్ మాజీ జెడ్పీటీసీ శంకర్ చవాన్, రైతు సమన్వయ కమిటీ అధ్యక్షుడు పుప్పుల పీరాజీ, మండల కోఆప్షన్ సభ్యుడు దత్తు హరిపటేల్, సర్పంచులు సంఘం అధ్యక్షుడు దత్తుగౌడ్ ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

జాన్సన్ నాయక్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలి



నవతెలంగాణ-కడెం

ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్య జాన్సన్ నాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షులు జొన్నల చంద్రశేఖర్ గుప్తా అన్నారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు ధర్మాజీపేట్, నచ్చన్‌ఎల్లాపూర్ గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు గడప గడపకు ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను, బీఆర్ఎస్ మేనిఫెస్టోను వివరించారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమని అన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి ఖానాపూర్ నియోజకవర్గంలో ముచ్చటగా మూడోసారి ఖానాపూర్ గడ్డమీద బీఆర్ఎస్ జెండా ఎగురవేయాలని అన్నారు. ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్య జాన్సన్ నాయక్ అత్యధిక మెజార్టీతో గెలిపించి, కేసీఆర్, కేటీఆర్‌లకు గిఫ్ట్‌గా అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎండీ రఫిక్ అహ్మద్, కడెం సర్పంచ్ కొండాపురం అనూష లక్ష్మణ్, ఖానాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయిని మంగ, బీఆర్ఎస్, కడెం మండల ప్రచార కార్యదర్శి ముబారక్ బీన్ మొహమ్మద్, కడెం టౌన్ అధ్యక్షులు కే రవి, మండల కోఆప్షన్ సభ్యులు ఎస్‌కే హైమద్, పార్టీ సీనియర్ నాయకులు చిట్టేటి ముత్తన్న, నల్లగొండ, సపవత్ రవి, గౌసోద్దీన్, ఎండీ కలీం, ఎండీ హసీబ్, బోర్లకుంట రాజేష్, కత్తర్‌పాక శేఖర్, వేణు నాయక్, భూక్య శేఖర్, గంగన్న, జాడి నర్సయ్య, సయ్యద్ షకీల్, సయ్యద్ నుస్రత్, ఆర్ల రాజేశ్వరి, కరుణ, ప్రజాప్రతినిధులు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలి

నవతెలంగాణ-నిర్మల్

ఎలాంటి అనుమానాలకు తావులేకుండా ఎన్నికల ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ సూచించారు. రాష్ట్ర శాసనసభ-2023 ఎన్నికలను పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో సీఈఓ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణతో ముడిపడిన వివిధ అంశాలకు సంబంధించిన నివేదికలను అందించడంలో తాత్సారం చేయకుండా సకాలంలో పంపించాలని తెలిపారు. ఎనభై ఏండ్లు పైబడిన వృద్ధులు, 40 శాతానికి పైగా వైకల్యం కలిగిన దివ్యాంగులకు వారివారి ఇండ్ల వద్ద నుండే ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా చేపట్టిన ఏర్పాట్ల గురించి ఆయా జిల్లాల ఎన్నికల అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసి, వారికి అవసరమైన శిక్షణ అందించారా అని అడిగి తెలుసుకున్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఈవీఎం యంత్రాల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు, రిసెప్షన్ కేంద్రాల వద్ద పక్కాగా ఏర్పాట్లు చేయాలన్నారు. ఎన్నికల ప్రచారానికి సంబంధించిన సమావేశాలు, సభలు నిర్వహించుకునేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధుల, అభ్యర్థుల నుంచి సువిధ పోర్టల్ ద్వారా వచ్చే దరఖాస్తులకు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, నిర్ణీత గడువులో అనుమతులు మంజూరు చేయాలని అన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలపై వచ్చే ఫిర్యాదులను తక్షణమే స్పందిస్తూ, ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ఎన్నికల అధికారి. ఆశిష్ సంగ్వాన్, ఆర్డీఓ జీవాకర్ పాల్గొన్నారు.

బీజేపీ బీసీలపై కపట ప్రేమ

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

బీజేపీ బీసీలపై కపట ప్రేమ చూపిస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న అన్నారు. మంగళవారం బీంసరి, అర్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వివరించారు. ఫలాలు పొందిన ప్రతిపక్ష పార్టీల నాయకులు సైతం ఎన్నికల వేళ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని అన్నారు. టికెట్లు అమ్ముకున్న కాంగ్రెస్ పార్టీ, ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన బీజేపీ పార్టీలకు ప్రజా క్షేత్రంలో తగిన గుణపాఠం చెప్పాలని అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి పదవి నుంచి బండి సంజయ్‌ను ఎందుకు తొలగించారని ప్రశ్నించారు. ఆయా గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేకే తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. పార్టీ నాయకులు ప్రమోద్ భానుకర్ ఆధ్వర్యంలో మంగ్లీ, భీంసరి గ్రామాలకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు, యువకులు పెద్ద ఎత్తున బీఆర్ఎస్‌లో చేరగా వారికి గులాబి కండువాలు కప్పి ఆహ్వానం పలికారు. ఈ మేరకు ఎమ్మెల్యే జోగు రామన్న మాట్లాడుతూ ఎన్నికల సమయంలో బీజేపీ బీసీ అభ్యర్థిని సీఎం చేస్తామంటూ బూటకపు హామీలు ఇస్తోందని మండిపడ్డారు. కేంద్ర బడ్జెట్‌లో బీసీల సంక్షేమం కోసం రెండు వేల కోట్లను మాత్రమే కేటాయించిన బీజేపీ బీసీల గురించి మాట్లాడటం హాస్యాస్పదమని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీల సంక్షేమానికి అయిదు వేల మూడు వందల కోట్లకు పైగా బడ్జెట్‌ను కేటాయించి, బీసీలకు సముచిత స్థానం కల్పించిందన్నారు. బండి సంజయ్‌ను రాష్ట్ర అధ్యక్షా పదవి నుంచి తొలగించడం ఆ పార్టీకి బీసీల పట్ల ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని తెలిపారు. ఆదిలాబాద్‌లో ఆయన బీసీల గురించి మాట్లాడటం విడ్డూరమని అన్నారు. స్థానిక బీజేపీ, కాంగ్రెస్ నాయకుల వ్యవహార శైలిపై ధ్వజమెత్తిన ఎమ్మెల్యే వారితో పాటు వారి కుటుంబ సభ్యులకు సైతం సంక్షేమ పథకాల ఫలాలు అందిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గండ్రత్ రమేష్, మంచికట్ల ఆశమ్మ, వేణుగోపాల్ యాదవ్, బొమ్మకంటి రమేష్, జిట్ట రమేష్, దుర్గం ట్రస్ట్ చైర్మెన్ దుర్గం శేఖర్, సాయిని రవి, దుర్గం శేఖర్ పాల్గొన్నారు.



ఓటు వేయాలంటే.. గుర్తింపు కార్డు తప్పనిసరి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఓటు హక్కును వినియోగించుకునేందుకు గుర్తింపు కార్డు తప్పనిసరి అని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. మంగళవారం ఆదిలాబాద్ రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఇంటి నుంచి ఓటింగ్, పోస్టల్ బాలెట్ల పంపిణీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన 13 రకాల గుర్తింపు కార్డులలో ఏదైనా ఒక గుర్తింపు కార్డుతో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చని తెలిపారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వయోవృద్ధులు, దివ్యంగులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఇంటి నుంచి ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కల్పించిందని, అందుకు అవసరమైన పూర్తీ ఏర్పాట్లు చేపట్టడం జరిగిందన్నారు. జిల్లాలో 765 మంది ఇంటి నుంచి ఓటింగ్ సదుపాయాన్ని వినియోగించుకోనున్నారని తెలిపారు. ఆదిలాబాద్ నియోజకవర్గంలో వయోవృద్ధులు 389, దివ్యాంగులు 121 మంది, బోథ్ నియోజకవర్గంలో వయోవృద్ధులు 162, దివ్యాంగులు 93 మందికి ఇంటి నుంచి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కల్పించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఖుష్బు గుప్త, రిటర్నింగ్ అధికారి స్రవంతి, అధికారులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం

నవతెలంగాణ-తాంసి

బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేద్దామని మాజీ ఎంపీ గోడం నగేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు గిరిగామ, అంబుగాం, ఆట్నంగూడ, వామన్‌నగర్, గ్రామాల్లో మండల నాయకులతో కలిసి ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా గిరిజన గ్రామాల్లోని ప్రజలకు కేసీఆర్ చేపట్టిన సంక్షేమ పథకాలను పెన్షన్ స్కీమ్‌లను వివరించారు. ప్రచారంలో భాగంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్, కేటీఆర్ బలపర్చిన బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్ జాదవ్‌ను బోథ్ ఎమ్మెల్యేగా గెలిపించుకొవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. అభ్యర్థి గెలుపు కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. గిరిజనులకు పోడు భూమి పట్టాల పంపిణీ చేయడంతో గిరిజనుల కండ్లలో ఆనందం ఉందన్నారు. ఆదివాసీ గిరిజనులు ఇతర పార్టీల నాయకులను నమ్మి మోసపోవద్దన్నారు. మన బతుకులు బాగుపడాలంటే మరోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని అన్నారు. ప్రతి కార్యకర్త కలిసికట్టుగా ఈ పది రోజులు కష్టపడి ప్రచారం ముమ్మరంగా చేయాలని అన్నారు. మూడోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ రాజు, ఎంపీపీ మంజుల శ్రీధర్ రెడ్డి, డా.వన్నెల అశోక్, కన్వీనర్ అరుణ్, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, రజిని, నారాయణ, మహేందర్, వెంకన్న, గజానంద్, నాయకులు కార్యకర్తలు ఉన్నారు.



బీఆర్ఎస్‌తోనే సమగ్రాభివృద్ధి

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

బీఆర్ఎస్‌తోనే సమగ్రాభివృద్ధి సాధ్యమని మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రమేందర్ అన్నారు. మంగళవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికి తిరుగుతూ కారు గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే జోగు రామన్నను బారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ప్రభుత్వ పథకాలను వివరించడంతో పాటు పార్టీ మేనిఫెస్టోను వివరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ మాట్లాడుతూ పట్టణంలో అభివృద్ధి జరగలేదంటూ ప్రతిపక్ష నాయకులు విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. ఇటీవల బండి సంజయ్ పర్యటించిన సమయంలో చేసిన విమర్శలను తిప్పికొట్టారు. వారసత్వ రాజకీయాల గురించి బీజేపీ నాయకులు మాట్లాడటం విడ్డూరమని పేర్కొన్నారు. బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి కుమారుడు సర్పంచ్‌గా ఎన్నికైన విషయాన్ని గుర్తు చేశారు. మత విద్వేషాలు రెచ్చగొడుతూ ప్రజల మధ్య చిచ్చు పెట్టేందుకు బీజేపీ చేస్తున్న యత్నాలను తిప్పికొట్టాలని సూచించారు. అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్న కారు గుర్తుకే ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో భూమన్న, పవన్ నాయక్, మిషు, విజ్జగిరి నారాయణ, రంగినేని శ్రీనివాస్, మహకల్ అజయ్, కలీం, మర్రి విజయ పాల్గొన్నారు.

అట్టహాసంగా ప్రారంభమైన పాలిటెక్నిక్ క్రీడా పోటీలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పట్టణంలోని సంజయ్‌గాంధీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆధ్వర్యంలో కబడ్డీ, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, ఖోఖో, టేబుల్ టెన్నిస్, అథ్లెటిక్స్, చెస్ క్రీడ పోటీలు మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఈ పోటీలు జరుగగా ముఖ్యఅతిథిగా డీఈఓ టి.ప్రణీత పాల్గొని ప్రారంభించారు. ఈ క్రీడల్లో పూర్వ ఆదిలాబాద్ జిల్లా అదిలాబాద్, బెల్లంపల్లి, నిర్మల్, మంచిర్యాల, ఉట్నూరు పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థిని విద్యార్థులు పాల్గొననున్నారు. ఈ క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని కోరుతూ క్రీడల ప్రాముఖ్యతను ప్రిన్సిపాల్ పి. భరద్వాజ వివరించారు. గౌరవ అతిథులుగా జిల్లా క్రీడల సమాఖ్య సెక్రటరీ కాంతారావు, జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి పాల్గొన్నారు. విద్యార్థులు క్రీడల్లో రాణించాలని రాష్ట్ర పోటీల్లో ఎంపిక కావాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల విభాగాల అధిపతులు రాజ్‌కుమార్, వీరస్వామి, సుజయ్, రాజన్న, సురేష్, పరిపాలన అధికారి రాజేష్, వ్యాయామ అధ్యాపకులు కుమారస్వామి, అధ్యాపకులు ప్రవీణ్, గజానంద్‌రావు, రామేశ్వర్‌రెడ్డి, సుధాకర్, రవి కుమార్, నీల్ కమల్, విజయలక్ష్మి ఉన్నారు.

ఎన్నికలపై విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎన్నికలపై విద్యార్థులకు అవగాహన కల్పించేలా పట్టణంలోని మథర్స్ కేర్ పాఠశాలలో స్కూల్ కెబినెట్ ఎన్నికలు నిర్వహించారు. సాధారణ ఎన్నికలను తలపించేలా ఉపాధ్యాయులు ఏర్పాట్లు చేశారు. పాఠశాల హెడ్ గర్ల్, బాయ్, డిప్యూటి హెడ్ గర్ల్, బాయ్‌ల కోసం ఎన్నికలు జరిగాయి. మొత్తం 27 మంది అభ్యర్థులు పోటీ చేశారు. బ్యాలెట్ ద్వారా పాఠశాలలోని ఒకటో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులు ఓటింగ్ వేశారు. విద్యార్థుల్లో ఎన్నికల పట్ల అవగాహన పెంచడంలో భాగంగా కెబినెట్ ఎన్నికలను నిర్వహించామని ప్రిన్సిపల్ మహ్మద్ నసీర్‌బిన్ ఇసా తెలిపారు. సాధారణ ఎన్నికలు 30న ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ తమ ఓటును వినియోగించుకోవాలని కోరారు.

కొనసాగుతున్న రైల్వే ట్రాక్ పనులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని సంజయ్‌నగర్ రైల్వే ట్రాక్ అత్యసవర పనుల నిమిత్తం రెండు రోజుల పాటు ఆ రూట్లో రాకపోకలను రైల్వే అధికారులు నిలిపివేశారు. కుర్షీద్‌నగర్, సెంట్రల్ జైలు, పొన్నారి, రణదివేనగర్ కాలనీలకు ఈ దారి నుంచే పోవాల్సి ఉంటుంది. అయితే ట్రాక్ అత్యవసర పనుల నిమిత్తం అధికారులు ఈ దారిని రెండు రోజుల పాటు మూసి వేసి పనులను చేపడుతున్నారు. మంగళవారం ఉదయం 8 నుంచి బుధవారం రాత్రి 8 వరకు దారి మూసి ఉంటుందని సూచిక బోర్డును సైతం ఏర్పాటు చేశారు. కుర్షీద్‌నగర్, పొన్నారి, మహారాష్ట్రకు వేళ్లే వారు తాంసి బస్టాండ్ మీదుగా వెళ్లాలని అధికారులు సూచించారు. రెండు రోజుల పాటు మరమ్మతులు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రజలు కూడా సహకారం అందించాలని రైల్వే అధికారులు కోరుతున్నారు.



24గంటలు విద్యుత్ ఇచ్చిన ఘనత బీఆర్ఎస్‌దే



నవతెలంగాణ-తలమడుగు

24గంటలు ఉచిత విద్యుత్ ఇచ్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని బోథ్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ అన్నారు. మంగళవారం మండలంలోని చర్లపల్లి, షేర్‌గూడ, టొక్కిగూడ, రత్నపూర్ గ్రామాల్లో మంగళవారం అనిల్ జాదవ్ ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల్లో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ మిషన్ భగీరథ ద్వారా రత్నాపూర్ గ్రామం కొండపైకి మంచినీరు అందించిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని అన్నారు. రత్నాపూర్ గ్రామం గురించి అసెంబ్లీలో చర్చించిన సీఎం కేసీఆర్ కోట్లాది రూపాయలతో వంతెన బీటీ రోడ్డు మంజూరు చేశారని అన్నారు. 30 ఎండ్లుగా పరిపాలించిన కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలను మంచినీటి కోసం కిలోమీటర్లు నడిపించిన ఘనత కాంగ్రెస్ పార్టీదని ప్రశ్నించారు. గోస పెట్టిన ఇందిరమ్మ రాజ్యం కావాలో ప్రజలు ఆలోచన చేయాలని కోరారు. రైతుల కోసం 24 గంటల ఉచిత నాణ్యమైన విద్యుత్‌ను బీఆర్ఎస్ ప్రభుత్వం అందిస్తోందని అన్నారు. అలాంటిది కాంగ్రెస్ నాయకులు మూడు గంటల విద్యుత్ సరిపోతుందని అనడం ఎంతవరకు సమంజసమని అన్నారు. సీఎం కేసీఆర్ తెలంగాణ ప్రజలకు అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రవేశపెడితే ఓర్వలేని కాంగ్రెస్, బీజేపీలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని అన్నారు. రైతుబంధు రైతుబీమా, రైతును రాజు చేయాలని ఉద్దేశంతో పథకాలను ప్రవేశపెడితే బీజేపీ ప్రభుత్వం రైతుల కోసం నల్ల చట్టాలను తీసుకువచ్చి హర్యానా, పంజాబ్, ఢిల్లీ రైతులపై కేసులు నమోదు చేసి, ట్రాక్టర్లను ఎక్కించిన ఘనత బీజేపీ ప్రభుత్వానిదని అన్నారు. ప్రజలందరూ ఏకమై బీఆర్ఎస్‌ను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మెన్ అడ్డి బోజారెడ్డి, మండల కన్వీనర్ తోట వెంకటేష్, బోథ్ నియోజకవర్గ అధికార ప్రతినిధి కిరణ్, సంజీవరెడ్డి, వసంత్‌రెడ్డి, అబ్దుల్లా, కేదారీశ్వర్‌రెడ్డి, సర్పంచులు ఆనంద్, కళ్లెం కరుణాకర్‌రెడ్డి, రాంబాయి, నర్సింలు, రాజేశ్వర్, కిష్టన్న, పార్టీ నాయకులు జీవన్‌రెడ్డి, నేతుల గంగన్న, అభిరామ్‌రెడ్డి, ఆసం రవి పాల్గొన్నారు.

పతి గెలుపు కోసం సతి ప్రచారం



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

పతి గెలుపు కోసం జోగు రామన్న సతీమణి జోగు రమ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. మంగళవారం పట్టణంలోని రణదీవేనగర్ కాలనీలో ఇంటింటికి తిరుగుతూ కారు గుర్తుకే ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. మహిళలకు బొట్టు పెడుతూ ఓట్లను అభ్యర్థించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను, మేనిఫెస్టోను వివరించారు. కాలనీ వాసులను ఆప్యాయంగా పలకరిస్తూ ప్రచారాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా జోగు రమ మాట్లాడుతూ ఇంటింటికి సంక్షేమ ఫలాలు అందించిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కుతుందని అన్నారు. కారు గుర్తుకే తమ ఓటని ప్రజలు భావిస్తున్నారని అన్నారు. సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న తమ పార్టీకే సంపూర్ణ మద్దతు ఉందని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కోవ రవి, బొడగం మమత, ప్రభావతి, నల్ల మహేందర్, రేఖ, గోవర్ధన్ యాదవ్, జహురుద్దీన్ పాల్గొన్నారు.

పోలీస్ బందోబస్తుపై సమావేశం



నవతెలంగాణ-నిర్మల్

అసెంబ్లీ ఎన్నికలకు నేపథ్యంలో పోలీస్ బందోబస్తు ప్రక్రియపై జిల్లా ఎస్పీ చల్లా ప్రవీణ్ కుమార్ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి సాధారణ పరిశీలకులు రవిరంజన్ కుమార్, విక్రమ్, పోలీస్ పరిశీలకులు లక్ష్మణ్ నింబర్గి సమక్షంలో జిల్లా కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా ఎన్నికల ఏర్పాట్ల తీరును పోలీస్ బందోబస్తు ప్రక్రియను ప్రజెంటేషన్ ద్వారా ఎస్పీ వివరించారు. అసెంబ్లీ నియోజక వర్గాలకు సంబంధించి మొత్తం 922 పోలింగ్ కేంద్రాలకు, నిర్మల్ నియోజకవర్గానికి సంబంధించి 306 పోలింగ్ కేంద్రాలకు, ముదోల్ నియోజకవర్గానికి సంబంధించి 311 పోలింగ్ కేంద్రాలు, ఖానాపూర్ నియోజకవర్గానికి సంబంధించి 305 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ఎన్నికల విధులు నిర్వహించే పోలీస్ సిబ్బందిని గురించి వివరించారు. ఈ సందర్భంగా పరిశీలకులు మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో పోలీస్, రెవెన్యూ, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో టీమ్‌వర్క్‌తో సమిష్టిగా ఎన్నికల కమీషన్ నియమావళి ప్రకారం నడుచుకోవాలని, శాంతియుత వాతవరణంలో స్వేచ్ఛగా తమ ఓటుహక్కును వినియోగించుకునేలా గట్టి చర్యలు చేపట్టాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై నిఘా ఉంచాలని అన్నారు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు ప్రచారాలను వెంటనే గుర్తించాలని, పోలింగ్ శాతం పెరిగే విధంగా ఓటరు నిర్భయంగా వచ్చి తన ఓటు తనకు నచ్చిన వ్యక్తికే వేసుకునే విధంగా కృషి చేయాలని అన్నారు. అదేవిధంగా ప్రతి ఒక్క పోలింగ్ బూత్ దగ్గర పటిష్ఠ భద్రత ఏర్పాట్లు చేయాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని అన్నారు. పోలింగ్ బూత్‌కు 100 మీటర్ల అవతలని వాహనాలను ఆపే విధంగా పార్కింగ్ ఏర్పాటు చేయాలని, ఎన్నికల కోడ్ ఉల్లంఘనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఎస్పీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక జేఏసీ నాయకులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మాల సంక్షేమ సంఘం జిల్లా నాయకులు అల్లూరి భుమన్నపై రాజకీయ దురుద్దేశంతో అసత్య ఆరోపణలు ఎమ్మార్పీఎస్ నాయకులు చేయడాన్ని ఖండిస్తున్నట్టు ఎస్సీ వర్గీకరణ జేఏసీ కమిటీ నాయకులు పేర్కొన్నారు. ఈ విషయమై మంగళవారం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఒక వర్గానికి వ్యతిరేకంగా ప్రధాని చేసిన వ్యాఖ్యలు ఖండించడం జరిగిందని కానీ ఎటువంటి రాజకీయ ఉద్దేశ్యాలు లేవని అన్నారు. సంఘ అధ్యక్షుని అప్రతిష్ట పాలు చేయడం కోసం ప్రభుత్వ ఉద్యోగులపై నింద ఆరోపణలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు రత్నెజాడే ప్రజ్ఞా కుమార్ తుల్జాపూరే శోభాతాయి, ప్రవీణ్ మస్కే శ్రీనివాస్, సాయిబాబా, సిద్దార్థ ఉన్నారు.

ఆసిఫాబాద్ జిల్లాలో ఐటీ దాడుల కలకలం

- కాగజ్‌నగర్, ఆసిఫాబాద్‌లో ఏకకాలంలో దాడులు
- ప్రముఖ వ్యాపారులు కాసం శ్రీనివాస్, రఫీక్ ఇళ్లలో సోదాలు
- అప్రమత్తమైన ఇతర బడా వ్యాపారులు

నవతెలంగాణ - కాగజ్‌నగర్/ఆసిఫాబాద్

ఎన్నికల ప్రచారం ఊపందుకుంటున్న సమయంలో మంగళవారం ఐటీ అధికారుల తనిఖీలు జిల్లాలో కలకలం రేపాయి. ఉదయం 5గంటల నుంచే ఐటీ శాఖ డీఎస్పీ రమణమూర్తి నేతృత్వంలో ప్రత్యేక బృందాలు దాడులు ప్రారంభించాయి. జిల్లాలోని కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ పట్టణంలో ఏకకాలంలో వ్యాపారస్థుల ఇళ్లల్లో ఐటీ అధికారులు సోదాలు నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పార్టీలకు అనుబంధంగా ఉన్న వ్యాపారుల ఇళ్లల్లో సోదాలు కొనసాగుతున్నాయి. బీఆర్ఎస్ పార్టీ నాయకుడు, సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్పకు ప్రధాన అనుచరుడిగా ఉన్న కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన ప్రముఖ రైస్ మిల్లు వ్యాపారి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాసం శ్రీనివాస్ ఇంట్లో ఉదయం ఐదు గంటలకు చేరుకున్న ఐటీ అధికారులు సోదాలు నిర్వహించారు. శ్రీనివాస్‌ను పలు కీలక అంశాలపై వివరాలు అడిగినట్టు తెలుస్తోంది. మధ్యాహ్నం ఐటీ అధికారులు కాసం శ్రీనివాస్‌ను వెంట తీసుకుని పట్టణంలోని స్టేట్ బ్యాంకుకు వెళ్లారు. అక్కడ బ్యాంకు లావాదేవీలు, పలు స్టేట్‌మెంట్లను పరిశీలించినట్టు తెలుస్తోంది. అనంతరం తిరిగి కాసం శ్రీనివాస్ ఇంటికి వెళ్లిన అధికారులు రాత్రి వరకు సోదాలు నిర్వహించారు. ఇక ఆసిఫాబాద్ పట్టణానికి చెందిన ప్రముఖ జిన్నింగ్ మిల్లు వ్యాపారి రఫీక్ ఇంట్లో సైతం ఉదయం ఐదు గంటల నుంచే ఐటీ అధికారులు దాడులు ప్రారంభించారు. ఇటీవల సీఎం కేసీఆర్ ఆసిఫాబాద్‌లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో రఫీక్ బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పలు లావాదేవీలపై రఫీక్‌ను విచారిస్తున్నట్టు తెలుస్తోంది. రాత్రి వరకు దాడులకు సంబంధించిన వివరాలు ఐటీ అధికారులు వెల్లడించలేదు. ఐటీ సోదాల్లో ఇప్పటివరకు ఏమేమి దొరికాయో అంచనా వేయలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఐటీ అధికారులు చేస్తున్న దాడులతో ఆసిఫాబాద్ జిల్లాలోని బడా వ్యాపారస్తులు, కాంట్రాక్టర్ల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. దాడుల విషయం తెలుసుకున్న పలువురు బడా వ్యాపారస్తులు తమ తమ ఇళ్లలోని నగదు, బంగారాన్ని ఇతర ప్రదేశాల్లో దాచిపెట్టి అప్రమత్తమైనట్టు తెలిసింది. ఐటీ దాడుల నేపథ్యంలో అధికారులకు పోలీసు బందోబస్తు కల్పించారు. ఎన్నికల నేపథ్యంలో తమకు అనుకూల వాతావరణం ఉండడంతో ప్రతిపక్షాలు ఐటీ దాడులు చేయిస్తున్నాయని బీఆర్ఎస్ శ్రేణులు ఆరోపిస్తున్నాయి.

క్షతగాత్రుడికి ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలోని మునిపెల్లి గ్రామానికి చెందిన సంగెం బద్రెన్న అనే వ్యక్తికి బీఆర్ఎస్ నాయకులు రూ.15 వేల ఆర్థిక సాయాన్ని మంగళవారం అందజేశారు. నిర్మల్‌లో జరిగిన సీఎం ప్రజా ఆశీర్వాద సభకు టీఏస్ ఎక్సెల్‌పై వెళుతుండగా జరిగిన ప్రమాద ఘటనలో కాలు విరిగిన సంగతి తెలిసిందే. వైద్యం అనంతరం పరామర్శించి ఈ ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ఇన్‌చార్జి నాయకులు అల్లోల సురేందర్‌రెడ్డి, మండల కన్వీనర్ కొరిపెల్లి కృష్ణారెడ్డి, నాయకులు గుర్రాల లింగారెడ్డి, రాంపెల్లి రమేష్, మేడిపెల్లి నరహరి, నారాయణ ఉన్నారు.



వారసంతలో జోరుగా ప్రచారం

నవతెలంగాణ-దహెగాం

మండలకేంద్రంలోని వారసంతలో మంగళవారం బీఆర్ఎస్, బీఎస్పీ, ఆర్పీఐ పార్టీలు జోరుగా ప్రచారం నిర్వహించారు. బీఎస్పీ నాయకులు దుకాణ సముదాయాలు తిరుగుతూ బహుజనుల గొంతుక ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. అలాగే బీఆర్ఎస్ నాయకులు సైతం వారసంతలో కళాకారుల ఆటపాటల ద్వారా బీఆర్ఎస్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. పేద, మధ్య తరగతి ప్రజలందరికి ఎల్లప్పుడు అందుబాటులో ఉండే కోనేరు కోనప్పను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అలాగే ఆర్పీఐ పార్టీ అభ్యర్థి జాడి దీపక్ సైతం వారసంతలో తిరుగుతూ ప్రచారం చేపట్టారు. పేద, మధ్య తరగతి ప్రజలందరికి ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని, ప్రజలందరికి సేవలందించడానికే ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నానన్నారు. గ్యాస్ సిలీండర్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. అలాగే ఐనం, బీబ్రా, ఇట్యాల, పంబాపూర్, బోర్లకుంట, కొత్మీర్ గ్రామాల్లో సైతం ప్రచారం నిర్వహించారు. ప్రచార కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

తుపాకీ రాముళ్లు వస్తున్నారు జాగ్రత్త

- బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోనేరు కోనప్ప



నవతెలంగాణ-బెజ్జూరు

ఎన్నికలకు ముందు ప్రజలకు దూరంగా ఉన్న వారు ఎన్నికలు రాగానే ప్రజల్లోకి వస్తూ తుపాకీ రాముని మాటలు మాట్లాడుతున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోనేరు కోనప్ప అన్నారు. మంగళవారం మండలంలోని ముంజంపెల్లి, బారెగూడ, పోతపెల్లి, కాటెపెల్లి, కుకుడ, అంబగట్ట తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తనకు మరోసారి అవకాశం ఇవ్వాలని, మండలంలో పెండింగ్‌లో ఉన్న పనులన్నీ పూర్తిచేస్తామన్నారు. అధికారంలో ఉన్నా, లేకున్నా ప్రజల మధ్యలో ఉండి సేవలందించామన్నారు. ఓట్ల కోసం మాయమాటలు చెప్పే నాయకులు గ్రామాలకు వస్తున్నారని, వారి మాటలు నమ్మద్దని, నిజాలను, అబద్దాలను తెలుసుకొని ఓటు హక్కును వినియోగించాలన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వమే వస్తుందని, పెన్షన్ల పెంపు, రైతుబంధు పెంపు, అసైండ్ భూములకు పట్టాలు చేయడం, బీసీ, ఎస్సీలకు పోడు పట్టాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. 30వ తేదీన కారు గుర్తుకు ఓటు వేసి తుపాకీ రాముళ్లకు బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు డోకె వెంకన్న, బశరథ్‌ఖాన్, పుల్లూరి సతీష్, జావీద్ అలీ, జావీద్ హుస్సేన్, మహేష్, రేణికుంట్ల పెంటయ్య, రేణికుంట్ల సంతోష్, ఏనుక శ్రీహరి పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద అన్ని ఏర్పాట్లు చేపట్టాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 30వ తేదీన పోలింగ్ అనంతరం డిసెంబర్ 3వ తేదీన నిర్వహించు కౌంటింగ్ ప్రక్రియకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బొర్కాడే హేమంత్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని ఎన్నికల సాధారణ పరిశీలకులు రాహుల్ మహివాల్, పోలీస్ పరిశీలకులు డీకే చౌదరి, జిల్లా ఎస్పీ సురేష్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 001-సిర్పూర్, 005-ఆసిఫాబాద్ నియోజకవర్గాలకు జరగనున్న ఎన్నికలలో భాగంగా డిసెంబర్ 3న కౌంటింగ్ జరుగుతున్న, ఈ క్రమంలో కౌంటింగ్ కేంద్రంలో అధికారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు ఏర్పాటు చేయాలని, తాగునీరు, విద్యుత్, కౌంటింగ్ హాల్స్, కౌంటర్లు, ఇతర పూర్తి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద సీసీ కెమెరాలతో పర్యవేక్షిస్తూ బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కౌంటింగ్ కేంద్రంలో కౌంటింగ్ రోజున అధికారులకు, అభ్యర్థులకు వేరువేరు ప్రదేశాలలో ఏర్పాట్లు చేయాలని తెలిపారు. జిల్లాలో పోలింగ్, కౌంటింగ్ కార్యక్రమాలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వెంకటరమణ, కలెక్టరేట్ ఏఓ రఫతుల్లా, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీల్లో రూ.లక్ష సీజ్



నవతెలంగాణ-వాంకిడి

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం మండలకేంద్రంలోని టోల్‌ప్రాజా వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా రూ.లక్ష నగదును పట్టుకున్నట్టు ఎస్సై సాగర్ తెలిపారు. మహారాష్ట్రకు చెందిన ఫెరోజ్ షెబీర్ కురశియా మహారాష్ట్రలోని హైమద్‌నగర్ నుంచి సిరువంచకు వాహనంలో వెళ్తుండగా టోల్‌ప్రాజా వద్ద తనిఖీ చేయగా రూ.లక్ష నగదు ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో డబ్బులను సీజ్ చేసినట్టు ఎస్సై తెలిపారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం



నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండలంలో దింద గ్రామంతో పాటు వివిధ గ్రామాలలో ప్రచారం నిర్వహించిన సిర్పూర్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోనేరు కోనప్పకు ఆయా గ్రామాల ప్రజలు మంగళవారం ఘన స్వాగతం పలికారు. అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ సామాన్య కార్యకర్తనైన నన్ను ఎమ్మెల్యేగా మూడు సార్లు ఆదరించి గెలిపించారని, మీకు ఎల్లప్పుడూ మా కుటుంబం రుణపడి ఉంటుందని, ఈ నియోజకవర్గ ప్రజలకు సేవ చేసేందుకు ఎల్లప్పుడూ ఉంటానని తెలిపారు. ఇక ఎన్నికలు రాగానే మనపై ఎనలేని ప్రేమ చూపిస్తున్నట్టు నటిస్తూ మన నియోజకవర్గంలో కొంతమంది ప్యారచూట్ నాయకులు ఓట్ల కోసం తిరుగుతున్నారని, అటువంటి వారికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని, ప్యారచూట్ నాయకులకు ఈ నియోజకవర్గంలో చోటు లేదని గతంలో ఎన్నో సార్లు ఇక్కడి ప్రజలు ఓటుతో బుద్ది చెప్పారని, ఈ ఎన్నికల్లో సైతం అదే జర్గుతుందని అన్నారు. ఇప్పటికే ఈ నియోజకవర్గానికి సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల రూపంలో అనేక నిధులు కేటాయించారని మారుమూల ప్రాంతమైన మన నియోజకవర్గాన్ని అనేక విధాలుగా అభివద్ధి చేసిన ఘనత మన ముఖ్యమంత్రి దే, రాబోయే రోజుల్లో కూడా అభివద్ధి చేసే నాయకుడు మన కేసిఆరే అని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో మన కారు గుర్తుకు ఓటు వేసి నియోజకవర్గ ఎమ్మెల్యేగా తనను ఆశీర్వదించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ డబ్బుల ననాయ్యా, నాయకులు వెంకన్న, బింకరి నారాయణ, సోమన్న, డోకే నారాయణ మహిళలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలని ప్రచారం

నవతెలంగాణ-వాంకిడి

మండలకేంద్రంలోని లక్ష్మీనగర్, కేబీనగర్, బస్టాండు వాడలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, జడ్పీటీసీ అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం ఆసిఫాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవలక్ష్మిని గెలిపించాలని ఇంటింటికి తిరుగుతూ బీఆర్ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ అజయ్‌కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిరుపేదల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని, 24 గంటల కరెంటు, రైతుబంధు, రైతుబీమా, కళ్యాణిలక్ష్మీ, షాదీముభారక్, అర్హులందరికి పింఛన్లు, ఒంటరి మహిళలకు, వికలాంగులకు, అన్ని గ్రామాలకు మిషన్ భగీరథ నీరు,



గ్రామాల్లో సిమెంటు రోడ్లు, కేసీఆర్ కిట్లు అందించడం జరుగుతుందని, బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవలక్ష్మిని కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆయన వెంట సర్పంచ్ బండె తుకారాం, సింగిల్‌విండో చైర్మన్ జాబిరి పెంటు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యుడు అశోక్, బీఆర్ఎస్ నాయకులు శెఫిక్, అషితోష్, అయూబ్, రఘు, అనిల్, నాయకులు పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల 2వ ర్యాండమైజేషన్ పూర్తి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



శాసనసభ నియోజకవర్గ ఎన్నికల్లో భాగంగా ఈ నెల 30వ తేదీ జరుగనున్న పోలింగ్ సందర్భంగా ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల 2వ రాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బొర్కాడే హేమంత్ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని 005-ఆసిఫాబాద్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఎన్నికల సాధారణ పరిశీలకులు రాహుల్ మహివాల్, ఆసిఫాబాద్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి దాసరి వేణుతో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల 2వ రాండమైజేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికలు సజావుగా సాగేందుకు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఈ క్రమంలో జిల్లాలోని 005-ఆసిఫాబాద్ నియోజకవర్గ పరిధిలో ఏర్పాటు చేసిన 305 పోలింగ్ కేంద్రాలకు బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్ల 2వ విడత కేటాయింపు ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో ఎన్నికలు సజావుగా సాగేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నవతెలంగాణ-జైపూర్

మండలంలోని టేకుమట్ల శివారులో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మంచిర్యాల పట్టణానికి చెందిన తోకల తిరుపతి(38) మృతి చెందాడు. చెన్నూర్ మండలం సోమన్‌పల్లి నుంచి శివ్వారం, టేకుమట్ల మీదుగా మోటార్ సైకిల్ పై ప్రయాణిస్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు స్థానిక ఎస్సై ఉపేందర్‌రావు తెలిపారు. మోటార్ సైకిల్ పై ప్రయాణిస్తున్న తిరుపతి ఆగివున్న క్రేన్‌ను ఢీకొట్టడంతో తలకు తీవ్రంగా గాయాలై అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. చెన్నూర్ మండలం సోమన్‌పల్లి గ్రామానికి చెందిన తిరుపతి గత కొంత కాలంగా మంచిర్యాలలో నివాసముంటున్నాడు. సోమవారం తన స్వంత గ్రామం సోమన్‌పల్లికి వెళ్లిన తిరుపతి తిరుగు ప్రయాణంలో మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నవతెలంగాణ
నమ్మిన తెలుగు దినపత్రిక
మంచిర్యాల
బుధవారం నవంబర్ 22, 2023

సీఓఈలో రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు

నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి సీఓఈలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) అండర్-19 బాల్ బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలను మంగళవారం నిర్వహించారు. ఈ పోటీలలో పాల్గొన్న ఆసిఫాబాద్, మంచిర్యాల, ఆదిలాబాద్ జిల్లాలకు చెందిన క్రీడాకారులను సీఓఈ ప్రిన్సిపాల్ ఐనాల సైదులు, తాళ్ల గురిజాల ఏఎస్సై రాజన్న, తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కాసిపేట్ ప్రిన్సిపాల్ ఊటూరి సంతోష్ , ఎస్జీఎఫ్ కార్యదర్శి బాబురావులు పరిచయం చేసుకున్నారు. అనంతరం ఉమ్మడి ఆదిలాబాద్ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆర్గనైజేషన్ సెక్రటరీ కె భాస్కర్ క్రీడాకారులకు పలు సూచనలు చేసి పోటీలను బెస్ట్ ఆఫ్ త్రీ పద్ధతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఐనాల సైదులు మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడలతో మంచి క్రమశిక్షణ పొందుతారని తెలిపారు. గెలుపోటములను సమానంగా తీసుకోవాలని క్రీడాకారులకు సూచించారు. ఈ పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని వివిధ కళాశాలల నుంచి 45 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఈ పోటీలను వ్యాయామ ఉపాధ్యాయులు అల్లూరి వామన్, నడిగోటి రాకేష్, కుమ్మరి శ్రీకాంత్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయికి ఎంపికైన జట్టు

ఎం.వేణు, ఎ.వర్ధన్,ఎం చరణ్ (సీఓఈ బెల్లంపల్లి), ఎ.తరుణ్ (టీఎస్ మోడల్ స్కూల్ ఆసిఫాబాద్), జె.మల్లయ్య, ఎం. ప్రణీత్ (టీఎస్ డబ్ల్యూ ఆర్ఎస్ జైపూర్), ఎం వెంకటరాజు , వర్ధన్ (టీఎస్ డబ్ల్యూ ఆర్ఎస్ కాసిపేట) జట్లు ఎంపికయ్యారు.

మూడేండ్ల కాలంలోనే అభివృద్ధి చేశాం

● చెన్నూరు బీఆర్ఎస్ అభ్యర్థి బాల్క సుమన్

నవతెలంగాణ-జైపూర్

చెన్నూరు ఎమ్మెల్యేగా ఐదేండ్ల పదవీ కాలంలో మునుపెన్నడు లేని అభివృద్ధి మూడేండ్లలో చేసి చూపించామని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బాల్క సుమన్ అన్నారు. మంగళవారం మండలంలో పర్యటిస్తూ ఇంటింటి ప్రచారం చేపట్టిన ఆయన కుందారంలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని వివరించారు. మొదట కుందారం గ్రామంలో పర్యటించిన ఆయన స్థానిక సర్పంచ్ సమ్మయ్యతో కలిసి బీఆర్ఎస్ ప్రకటించిన పథకాలను వివరిస్తూ వాటి ద్వార కలుగు ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా కుందారం గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను వివరిస్తూ రూ.1.50 కోట్లతో సీసీ రోడ్లు, మురికి కాలువల నిర్మాణాలు పూర్తి చేసినట్లు తెలిపారు. అదేవిధంగా రూ.1.56 కోట్లతో చేపట్టిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణం పూర్తి కావస్తుండగా రూ.18 లక్షలతో మహిళా భవన్, రైతు వేదిక, హెల్త్ సబ్ సెంటర్ ఏర్పాటు చేసుకోగలిగామని పేర్కొన్నారు. అయినప్పటికి ఇంకా గ్రామ పంచాయతీ పరిధిలో చేపట్టాల్సిన అవ్వద్ధి పనులు రేపటి రోజుల్లో చేపట్టబోతామని అన్నారు. 58 సంవత్సరాలు రాష్ట్రంలో ప్రభుత్వాలు నడిపిన



కాంగ్రెస్, తెలుగుదేశంకు చెందిన వారిని అభివృద్ధి విషయమై నిలదీయాల్సిన అవసరముందని అన్నారు. కాంగ్రెస్ దొంగలకు ఓటు వేసి అభివృద్ధిని వెనక్కి తీసుకురావద్దని, ఊసరవెల్లి మాదిరిగా పార్టీలు మార్చే నాయకులను నమ్మవద్దని పేర్కొన్నారు. కుందారం, బెజ్జాల, షెట్‌పల్లి, పెగడపల్లి, గంగిపల్లి, టేకుమట్ల గ్రామాలలో రోడ్ షో నిర్వహించిన బీఆర్ఎస్ అభ్యర్థికి మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. బీఆర్ఎస్ జన ప్రబంజనంలో గడ్డం వివేక్ సోదరులు గల్లంతు కాబోతున్నారని విమర్శించారు. ఈ నెల 30న జరుగనున్న ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బాల్క సుమన్‌తో పాటు పెద్దపల్లి ఎంపీ వెంకటేష్ నేత, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు బలమూరి అరవిందరావు, ఎంపీపీ గోదారి రమాదేవి లక్ష్మణ్, జడ్పీటీసీ మేడి సునిత తిరుపతి, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు గుండు తిరుపతి పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం



మాట్లాడుతున్న మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు మెంగు లింగన్న

నవతెలంగాణ-దండేపల్లి

ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం దండేపల్లి మత్స్య సహకార సంఘం ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు మెంగు లింగన్న మాట్లాడుతూ సంఘం నాయకులు ఐక్యంగా ఉండి వృత్తిని కొనసాగించుకోవాలన్నారు. ముదిరాజ్‌లు, బెస్త కులస్తులు రాజకీయంగా ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం తమకోసం సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టడం చాలా సంతోషకరమైన విషయమని అన్నారు. ఉచిత చేప పిల్లల పంపిణీ అభినందనీయమని పిల్లలు సకాలంలో పెరిగి పెద్ద సైజు అయ్యేందుకు మత్స్యకారులు అధికారులకు పూర్తిగా సహకారం అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గంగన్న, నక్క ఆశాలు, గంగాధరి మల్లేష్, కల్లూరు భీమయ్య, గరిగే నరసయ్య, గరిగే మురళి, లచ్చన్న పాల్గొన్నారు.

కోమటిచేనులో ఓటు హక్కుపై అవగాహన

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని కోమటిచేను గ్రామంలో రానున్న అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా ఓటు హక్కుపై కాసిపేట ఎస్సై గంగారాం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై గంగారాం మాట్లాడుతూ ప్రజలకు ఎల్లవేళలా పోలీసులు సేవ చేసేందుకు అందుబాటులో ఉంటారని, ఏ సమస్యకైనా వెంటనే సమాచారం అందించాలని సూచించారు. ఓటు అనేది ప్రజల హక్కుని, నిర్భయంగా తమ ఓటును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జాన్సన్ నాయక్‌కు మద్దతుగా సినీ తారల ప్రచారం



నవతెలంగాణ-జన్నారం

ఖానాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్‌కు మద్దతుగా తెలంగాణ సినీ తారలు మంగళవారం జన్నారంలో ప్రచారం నిర్వహించారు. యజ్ఞం సినిమాలో విలన్ విజయ్ గంగరాజు, రియల్ స్టార్ హీరో అప్సర్ ఆజాద్, నిర్మాత, రాజశేఖర్, ఎన్నారై, బాలరాజు గౌడ్‌లు కారు గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం నిర్వహించారు. తెలంగాణలో కేసీఆర్‌ను మరోసారి ముఖ్యమంత్రి చేయడానికి ఖానాపూర్ నియోజకవర్గంలో జాన్సన్ నాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ప్రభుత్వం చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీపీ మాదాడి సరోజనా రవీందర్‌రావు, జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, పార్టీ మండల అధ్యక్షుడు గుర్రం రాజారామ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సులువ జనార్దన్, వైస్ ఎంపీపీ సుతారి వినయ్ కుమార్, కోఆప్షన్ సభ్యులు మున్వర్ అలీ చింతగూడ పీఏసీఎస్ చైర్మన్ నాసాని రాజన్న అలీఖాన్ జిల్లా నాయకులు భరత్ కుమార్ ఫజల్ ఖాన్, నాయకులు జాడిశంకర్ జున్గూరు మల్లయ్య పాల్గొన్నారు.

మథర్ థెరిసా పాఠశాలపై విచారణ

నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని కన్నెపల్లి గ్రామంలోని మథర్ థెరిసా పాఠశాలపై తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు జిల్లా విద్యాశాఖ అధికారులు మంగళవారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా విచారణ అధికారి మండల విద్యాధికారి కాసుల రవీందర్, జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారులు సత్యమూర్తి, చౌదరిల ఆధ్వర్యంలో తల్లిదండ్రుల సమక్షంలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా వివాదానికి గల కారణాలు ఇరు వర్గాలను నుండి అడిగి తెలుసుకున్నారు. అనంతరం విచారణ అధికారి రవీందర్ మాట్లాడుతూ పాఠశాల యజమాన్యం తీరు సరిగా లేదని చాలా సందర్భాల్లో ఫిర్యాదులు వస్తున్నాయని వారికి తెలియజేశారు. పాఠశాలలో నిబంధనలు పాటించకపోగా ప్రశ్నించిన విద్యార్థుల తల్లిదండ్రులపై కోపంతో విద్యార్థులను కావలనే ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం



చేశారు. యజమాన్యం తీరు సరిగా లేదని, పాఠశాలలో విద్యార్థులను ఫాదర్, సిస్టర్ అని పిలిపించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే పాఠశాల గుర్తింపు రద్దు చేస్తామని హెచ్చరించారు. న్యూస్ కవరేజ్ కోసం వచ్చిన జర్నలిస్టులపై దురుసుగా ప్రవర్తించడంపై కమిటీ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల తల్లిదండ్రుల పిలుపుమేరకే జర్నలిస్టులు న్యూస్ కవరేజ్ కోసం వచ్చారని అటువంటి వారిపై దురుసు ప్రవర్తన ఏంటని ప్రశ్నించారు. పలు అంశాలపై వారిని వివరణ కోరి తదుపరి పూర్తిస్థాయి నివేదికను జిల్లా విద్యాశాఖ అధికారికి అందజేస్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీ ఉగ్గే రమేష్ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'ఇతర రాష్ట్రాలకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఆదర్శం'

జైనూర్ : భారతదేశంలో ఉన్న 29 రాష్ట్రాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథల అమలుకు ఆదర్శంగా నిలిచిందని ఏజెన్సీ షెడ్యూల్ కులాల ఐక్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు మోతె రాజన్న, నేతకానీ రాష్ట్ర అధికార ప్రతినిధి జాడి రవీందర్ అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని గణేష్ నగర్ కాలనీలో అన్నాబావు సాటె విగ్రహానికి పూలమాలలు వేసి గ్రామస్తులతో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు ఎంతో అండగా నిలుస్తుందన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ పాలన ఉందని అభినందించారు. అదేవిధంగా దేశంలోనే దళితులను గుర్తించలేదని బీఆర్ఎస్ ప్రభుత్వం దళితబంధు పేరుతో ఆర్థిక సాయం అందించి దళితులను ప్రోత్సహిస్తుందని పేర్కొన్నారు. దళితబంధుతో దళిత కుటుంబాలకు ఎంతో న్యాయం జరుగుతుందని తెలిపారు. అనంతరం గ్రామస్తులు ఆయనకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏజెన్సీ షెడ్యూల్ కులాల ఐక్య సమితి రాష్ట్ర యువజన సంఘం అధ్యక్షుడు కాంబ్లే ఉద్దవ్, మాతంగ్ సమాజ్ జిల్లా అధ్యక్షుడు మోహాలె దత్తా పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓటు వేయాలి



నవతెలంగాణ-దిలావర్‌పూర్

బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. మంగళవారం దిలావర్‌పూర్ మండలంతో పాటు గుండంపల్లి, సముందర్‌పల్లి, కాండ్లి, మాడేగాం, కదిలి, న్యూలోలం గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ నిర్మల్ ఎమ్మెల్యే అభ్యర్థి మహేశ్వర్ రెడ్డి ఏ పార్టీలో ఉన్నా ఆ పార్టీకి ఓటమి తప్పదని, ఆయన హయంలో నిర్మల్‌ను నాశనం చేశారని అన్నారు. మహేశ్వర్‌రెడ్డి పీఆర్పీలో ఉంటే ఆ పార్టీ ఖతమైందని అన్నారు. అ తర్వాత కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు కాంగ్రెస్ మరుగైందన్నారు. ఇప్పుడు బీజేపీలోకి వెళ్లగానే తెలంగాణలో బీజేపీ పార్టీ కూడా భూస్థాపితం అవుతుందని ధ్వజమెత్తారు. దేవాదాయ శాఖ మంత్రిగా కొనసాగుతూ రెండు వేల ఆలయాల నిర్మాణం చేశానని, గురుకుల పాఠశాల అభివృద్ధికి కృషి చేశానని అన్నారు. నిర్మల్ జిల్లా సాధించి, మెడికల్ కళాశాల నిర్మించి, వైద్య నిపుణులను తయారు చేస్తున్న ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ సభ్యులు యు.సుభాష్‌రావు, పీఏసీఎస్ చైర్మెన్ రమణరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ దేవేందర్‌రెడ్డి, మండల ఎన్నికల ఇన్‌ఛార్జ్ రంజిత్‌రెడ్డి, ఎంపీపీ పాల్దె అక్షర అనిల్, సర్పంచులు ఇట్టెడి గంగారెడ్డి, తిరుమల శ్రీనివాస్, ఒడ్నం సవిత కృష్ణ, ముచ్చింధ్ల సరిత రాజు, ఎంపీటీసీ ఏలాల అమృత చిన్నారెడ్డి, కాల్వ నర్సింహ ఆలయ చైర్మెన్ మహేష్, కదిలి పాపేశ్వర ఆలయ చైర్మెన్ వెంకట్‌రావు, బీఆర్ఎస్ నాయకులు దనె రవి, కోడె రాజేశ్వర్, గుణవంత్ రావు, బుజంగ్‌రావు, కోడె నవీన్, సప్పల రవి పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు మద్దతు ఇవ్వండి

- సీపీఐ(ఎం) నాయకులను కోరిన ఎమ్మెల్యే జోగు రామన్న

నవతెలంగాణ- ఆదిలాబాద్‌అర్బన్



త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో తమకు మద్దతు ఇవ్వాలని బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే జోగు రామన్న సీపీఐ(ఎం) నాయకులను కోరారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని కార్యాలయానికి వచ్చిన ఆయన సీపీఐ(ఎం) నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రస్తుత రాజకీయ పరిణామాలపై ఇరువురు సుదీర్ఘంగా చర్చించారు. ఆదిలాబాద్ నియోజకవర్గంలో తమకు పార్టీ పరంగా మద్దతునివ్వాలని ఎమ్మెల్యే కోరగా.. జిల్లా కమిటీ సమావేశంలో చర్చించి తదుపరి నిర్ణయం వెల్లడిస్తామని పార్టీ జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ ఎమ్మెల్యేకు తెలియజేశారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు లంక రాఘవులు, బండి దత్తాత్రి, అన్నమొల్ల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సందీప్‌నగర్‌లో అర్ధరాత్రి ప్రచారంతో రసాభాస

నవతెలంగాణ-ఆసిఫాబాద్

కాంగ్రెస్ అభ్యర్థి అజ్మీర శ్యాంనాయక్ నిబంధనలకు విరుద్ధంగా ప్రచారం నిర్వహిస్తున్నారని సోమవారం రాత్రి సందీప్‌నగర్ కాలనీవాసులు, బీఆర్ఎస్ మద్దతుదారులు అడ్డుకున్నారు. రాత్రి 11 గంటల సమయంలో కాలనీలో ప్రచారం నిర్వహించవద్దని యువకులు రోడ్డుకు అడ్డంగా బైక్లు పెట్టడంతో కాంగ్రెస్ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అక్కడికి చేరుకున్న పోలీసులు నిబంధనలు విరుద్ధంగా వ్యవహరించిన అభ్యర్థిని పంపించాల్సింది పోయి బీఆర్ఎస్ మద్దతుదారులు, కాలనీవాసులపై లాఠీలతో కొట్టడంతో కాలనీలో ఉత్కంఠ నెలకొంది. కాంగ్రెస్ అభ్యర్థి వెళ్లారని పోలీసులు అబద్ధం చెబుతున్నారని యువకులు ఆందోళనకు దిగారు. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రచారం నిర్వహించిన కాంగ్రెస్ అభ్యర్థి శ్యాంనాయక్‌పై చర్యలు తీసుకోవాలని ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఎన్నికల అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని అక్కడి ప్రజలతో వివరాలు సేకరించారు.

పట్టణంలో ఊపందుకున్న బీఆర్ఎస్ ప్రచారం

నవతెలంగాణ- ఆదిలాబాద్‌అర్బన్

సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా వివిధ మండలాల్లో విస్తృతంగా పర్యటిస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న మంగళవారం పట్టణంలోనూ అదే తరహాలో తన ప్రచారాన్ని ప్రారంభించారు. ముందుగా స్థానిక డైట్ మైదానం నుంచి రోడ్ షో ప్రారంభించి పట్టణంలోని ప్రధాన వీధుల్లో విస్తృతంగా పర్యటించారు. దుకాణ సముదాయాలలో కలియ తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ మేనిఫెస్టోతో కూడిన కరపత్రాలను దుకాణదారులకు అందజేస్తూ పట్టణ అభివృద్ధికి చేపట్టిన చర్యలను వివరించారు. ప్రచారంలో భారీ సంఖ్యలో పార్టీ శ్రేణులు హాజరు కాగా పట్టణ ప్రధాన వీధులు గులాబీమయంగా మారాయి. డైట్ మైదానం నుండి ప్రారంభమైన ఎన్నికల ప్రచారం నేతాజీచౌక్, అంబేద్కర్‌చౌక్, గాంధీ చౌక్ మీదుగా సాగింది. దుకాణాదారులు ఎమ్మెల్యేకు సాదరంగా స్వాగతం పలకగా వారిని ఆప్యాయంగా పలకరిస్తూ ఎమ్మెల్యే ముందుకు సాగారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న కారు గుర్తుకు ఓటేసి భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

ఘనంగా ప్రపంచ మత్స్యకార దినోత్సవం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని స్థానిక శివాలయంలో అభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వాల్మీకి మహర్షి, గంగాదేవి చిత్రపటాలకు పూలమాలలు వేసి పూజలు చేశారు. ఈ సందర్భంగా గంగపుత్ర సంఘం అధ్యక్షుడు భూమన్న మాట్లాడుతూ మత్స్యకారులు సుఖసంతోషాలతో ఉండాలని ప్రపంచ మత్స్యకార దినోత్సవం రోజున శివాలయంలో పూజలు చేశామన్నారు. ఖానాపూర్ చెరువుతో పాటు చుట్టూ పక్కల చెరువుల్లో కూడా గుర్రపు డెక్క పెరిగి ఉపాధి లేకుండా పోయిందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించిన ఎలాంటి స్పందన రావడం లేదన్నారు. గంగాపుత్రులను చైతన్యవంతులను చేసి సమస్యల సాధన దిశగా ముందుకు సాగుతామన్నారు. ఈ కార్యక్రమంలో గంగపుత్ర సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భూమన్న, మేకల అశోక్, ఉపాధ్యక్షుడు భోజన్న, డైరెక్టర్లు మేకల శంకర్, ప్రవీణ్, రాము, సభ్యులు పెటన్న, కులస్తులు పాల్గొన్నారు.

కేసీఆర్ దమ్ముంటే

రాజకీయంగా కొట్లాడు: వివేక్



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

కేసీఆర్‌కు దమ్ముంటే రాజకీయంగా కొట్లాడాలని, కాని ఐటి అధికారులతో దాడులు చేయించం ఏంటని చెన్నూర్ కాంగ్రెస్ అభ్యర్థి వివేక్ వెంకటస్వామి అన్నారు. మంగళవారం మంచిర్యాలలోని ఇంట్లో ఐటీ దాడుల అనంతరం వివేక్ విలేకరులతో మాట్లాడారు. తప్పుడు ఆరోపణలతో తమ సంస్థలపై ఐటీ దాడులు రాజకీయ కుట్రలో భాగంగానే చేశారని ఆరోపించారు. చెన్నూరులో ఓడిపోతున్నానని బాల్క సుమన్ ఫిర్యాదుతో ఈ ఐటీ దాడులు జరిపించారన్నారు. మేం ఏం చేసినా చట్టం ప్రకారం చేశామన్నారు. కాళేశ్వరం, మిషన్ భగీరథ పెద్ద స్కామని, కల్వకుంట్ల ఫ్యామిలీ లక్షలది కోట్లు దోచుకుందని పేర్కొన్నారు. అవినీతిపై ప్రశ్నించే కేంద్రం చర్యలు ఎందుకు తీసుకోదని ప్రశ్నించారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనని ప్రజలకు అర్థమైందన్నారు. కేసీఆర్ సర్కార్ అవినీతిపై ఎన్ని సాక్ష్యాలిచ్చినా కేంద్రం చర్యలు తీసుకోలేదని, అమిత్‌షా స్టేట్‌మెంట్లకే పరిమితమయ్యారని ఆరోపించారు.

తగ్గని జోరు..ప్రచారం హోరు..



నవతెలంగాణ-నార్నూర్

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు జోరు పెంచి హోరెత్తిస్తున్నారు. ఇతర పార్టీలకు తగ్గకుండా గ్రామాల్లో సమావేశాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగానే మంగళవారం మండలంలోని బలాన్‌పూర్, నాగల్‌కొండ, మరపుగూడ గ్రామంలో తిరుగుతూ ఎమ్మెల్యే అభ్యర్థి కోవ లక్ష్మిని గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ ప్రకటించిన మేనిఫెస్టోను ఇంటింటా ప్రజలకు వివరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని అన్నారు. కారు గుర్తుకు ఓటేసి భారీ మెజారిటీతో కోవ లక్ష్మీని గెలిపించాలని కోరారు. ప్రచారంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఖాసిం, నాయకులు సుల్తాన్‌ఖాన్, ఫ్యాక్స్ డైరెక్టర్ దుర్గే కాంతారావ్, షేక్ దాదేఅలీ, రాథోడ్ రమేష్, కేంద్రే మాదవ్ ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి కళా ఉత్సవ్‌లో ఎంపికైన విద్యార్థులు ఇటీవల రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నారు. ఇన్స్ట్రుమెంటల్ మ్యూజిక్ మెలోడీ విభాగంలో ఆదిలాబాద్‌కు చెందిన సాక్షి జవహర్ రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం సాధించాడు. జానపద విభాగంలో జైనథ్‌కు చెందిన దేవేందర్ ద్వితీయ స్థానం సాధించాడు. వీరిని విద్యాశాఖాధికారి కార్యాలయంలో డీఈవో ప్రణీత మంగళవారం సత్కరించి అభినందనలు తెలిపారు.

ఎక్కడ అన్యాయం జరిగినా ఉంటాను: ప్రవీణ్

నవతెలంగాణ-లక్సెట్టిపేట

ఎస్సీ, ఎస్టీ ప్రజలకు ఎక్కడ అన్యాయం జరిగినా అక్కడ తానుంటానని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ మెంబర్ రేణిగుంట్ల ప్రవీణ్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో అంబేద్కర్ వాదులు ఆయనకు ఆత్మీయ సన్మానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాను గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా రూ.30కోట్లతో అధునాతన హంగులతో జిల్లా కేంద్రంలో లైబ్రరీ నిర్మాణానికి కృషి చేశానన్నారు. ఉచిత కోచింగ్ ద్వారా 140 మంది ఉద్యోగాలు సాధించారన్నారు. త్వరలోనే లక్సెట్టిపేటలో కోటి రూపాయలతో లైబ్రరీ నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో దండేపల్లి, లక్సెట్టిపేట మండల నాయకులు కొల్లూరి రవికుమార్, దర్శనాల నవీన్‌కుమార్, కళ్లేపల్లి విక్రమ్, ఈశ్వర్, మేకల దిలీప్, శనిగారపు శ్రీకాంత్, గంగారెడ్డి పాల్గొన్నారు.

ప్రజల కష్టాల్లో తోడుండే

నాయకున్ని గెలిపించాలి

నవతెలంగాణ-బేల

ప్రజల కష్ట సుఖాల్లో తోడుండి ప్రజల కోసం పాటు పడే వ్యక్తిని గెలిపించాలని కాంగ్రెస్ రెబల్ అభ్యర్థి సంజీవ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని జూనోని, సదల్‌పూర్, సోన్‌కాస్ గ్రామాల్లో మాజీ డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, గంగ్రత్ సుజాతలతో కలిసి ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల నిర్ణయం మేరకే కాంగ్రెస్ టికెట్ రాకపోయినా పోటీలో ఉన్నామని అన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు డబ్బులకు టికెట్ అమ్ముకున్నాడని అన్నారు. ఎన్నో ఏండ్లుగా పార్టీ కోసం కష్ట పడుతున్న మా ముగ్గురికీ కాదనకుండా కేవలం మొన్న మొన్న వచ్చిన వ్యక్తి టికెట్ ఇచ్చారని అన్నారు. అందుకే రెబల్‌గా పోటీకి సిద్ధమయ్యామన్నారు. ఓటేసి ఆదరించాలని ప్రజలను కోరారు.

కాంగ్రెస్‌కు ఓటేసి ఆదరించాలి

నవతెలంగాణ-నార్నూర్

ఆసిఫాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు ఓటేసి ఆదరించాలని కాంగ్రెస్ నాయకులు ఓటర్లను కోరారు. మంగళవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని సుంగాపూర్, చోర్గావ్, చిత్తగూడ గ్రామాల్లో ప్రచారం చేశారు. పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలను ప్రజలకు వివరించారు. కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని అన్నారు. కాంగ్రెస్ హయంలోనే ప్రతిఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు వచ్చాయని సూచించారు. చేతి గుర్తుకు ఓటేసి రాష్ట్రంలో రేవంత్ రెడ్డిని, నియోజక అభ్యర్థి శ్యాంనాయక్‌ను గెలిపించాలని కోరారు. ప్రచార కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు యూసఫ్ ఖాన్, షేక్ అహ్మద్, రమేష్, వసంత్ ఆడే, యూత్ కాంగ్రెస్ నాయకులు షేక్ నసీర్, మానిక్‌రావ్ ఉన్నారు.



అక్రమ మద్యం పట్టివేత

నవతెలంగాణ-లక్ష్మణచాంద

ఈ నెల 30న జరగనున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం మంగళవారం మండలంలోని పొర్పెల్లి గ్రామంలో ఒక వ్యక్తి ఇంట్లో సోదా చేసి, ఎన్నికల కోడ్ ఉల్లంగించి అక్రమంగా నిల్వ చేసిన 192 క్వాటర్స్ సుమారు 34.5 లీటర్ల మద్యాన్ని సీఐ నవీన్ కుమార్, ఏ స్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న మద్యం విలువ సుమారు రూ.37వేల వరకు ఉంటుందని సీఐ తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

మార్పు ద్వారానే అభివృద్ధి సాధ్యం

● కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వినోద్

నవతెలంగాణ-తాండూర్

అధికార మార్పు ద్వారానే అభివృద్ధి సాధ్యమవుతుందని ప్రజలు గ్రహించి కాంగ్రెస్‌కు బ్రహ్మరథం పడుతున్నారని బెల్లంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వినోద్ అన్నారు. ఆయన మంగళవారం తాండూరు మండలంలోని బోయపల్లె చౌటపల్లి కాసిపేట గ్రామాల్లో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రజలు విసిగిపోయి మార్పు కోరుకుంటున్నారని అన్నారు. ప్రజల అభివృద్ధిని ఆకాంక్షించి కాంగ్రెస్ నాయకత్వాన్ని బలపరుస్తున్నారని తెలిపారు. మంచిర్యాల జిల్లా ప్రాంత అభివృద్ధిని ఆకాంక్షించి కాంగ్రెస్ నుండి బరిలో నిలిచినట్లు తెలిపారు. ప్రజలు ఆశీర్వదిస్తే బెల్లంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజలకు సేవ చేసేందుకే ఎన్నికల బరిలో నిలిచినట్లు తెలిపారు. కాంగ్రెస్ మహిళలకు రైతులకు సామాన్య ప్రజలకు నిరుద్యోగులకు లబ్ది చేకూరేలా పథకాలను అమలు పరుస్తుందని తెలిపారు. మేనిఫెస్టోలో రూపొందించిన కాంగ్రెస్ 6 గ్యారంటీలు కచ్చితంగా అమలుపరుస్తుందని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కౌలు రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. కాంగ్రెస్ గెలిస్తే కౌలు రైతులకు పెట్టుబడి సాయం అందుతుందని తెలిపారు. పార్టీ కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికి కాంగ్రెస్ సముచిత స్థానం లభిస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గట్టు మురళీధర్ రావు సిరంగి శంకర్ ఎండీ ఈసా, మాసాడి తిరుపతి, మాసాడి కమలాకర్, ఏ భీమ గోపాల్ ఐటీయూసీ నాయకులు పేరం శ్రీనివాస్, సాతబాయ్య పాల్గొన్నారు.



ప్రజాధారణ జీర్ణించుకోలేకే ఐటీ దాడులు

● కాంగ్రెస్ ఆధ్వర్యంలో రస్తా రోఖో

నవతెలంగాణ-భీమారం

చెన్నూరు నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి మాజీ ఎంపీ వివేక్ వెంకట స్వామి గెలుపును ముందే గ్రహించిన బీఆర్ఎస్ నాయకులు ఐటీ దాడులు నిర్వహిస్తున్నారని కాంగ్రెస్ నాయకుల నిరసనలు వెలువెత్తాయి. బుధవారం మండల కేంద్రంలోని ఆవుడం ఎక్స్ రోడ్డు మంచిర్యాల-చెన్నూర్ జాతీయ రహదారిపై ధర్నా చేపట్టారు. వివేక్ కుటుంబంపై జరుగుతున్న ఐటీ దాడులను ఖండించారు. రాజకీయంగా ఎదుర్కోలేకనే ప్రచార సమయంలో వివేక్‌ను ఇరకాటంలో పెట్టి రాజకీయ లబ్దికోసమే బీఆర్ఎస్, బీజేపీలు కలిసి ఐటీ దాడులకు తెర లేపాయని మండిపడ్డారు. స్థానిక బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బాల్క, సుమన్‌కు ఓటమి భయం పట్టుకొని, నీచమైన రాజకీయాలకు తెరలేపి అడ్డదారిలో గెలవాలని ప్రయత్నిస్తున్నాడని విమర్శించారు. బీఆర్ఎస్, బీజేపీలు ఎన్ని కుట్రలు చేసినా నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరని, సుమన్ అరాచకపాలనను బొందపెట్టేందుకు చెన్నూర్ ప్రజలు ఎప్పుడో సిద్ధమయ్యారని అన్నారు. అధికార అహంకారంతో చేస్తున్న సుమన్ ఆగడాలను ప్రజలు గ్రహిస్తున్నారని, 30న జరిగే ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పేందుకు ప్రజలు ఎదురు చూస్తున్నారని, ఇంకా ఎంతోకాలం నీ ఆటలు చెల్లవని గుర్తు చేశారు. కార్యక్రమంలో మండల నాయకులు మోహన్ రెడ్డి, విశ్వ తేజ రెడ్డి, చెడంక తిరుపతి, సత్తి రెడ్డి, అనపర్తి రమేష్, డేగ రమేష్, షేడం శెట్టి రమేష్, అలకాటి తిరుపతి, త్రైనేని రవి, వివేక్ పాల్గొన్నారు.

పండ్లు, మంచినీళ్లు పంచిన జనసైనికులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

సిర్పూర్(టి)లోని సిద్ది టోంకిని హనుమాన్ 22వ మహా పాదయాత్రను పురస్కరించుకుని మంగళవారం జనసేన పార్టీ ఆధ్వర్యంలో భక్తులకు పండ్లు, మంచినీళ్లను పంపిణీ చేశారు. పార్టీ క్రియాశీలక కార్యకర్త పోతుల ప్రవీణ్ ఆధ్వర్యంలో 500 నీళ్ల బాటిల్లు, అరటి పండ్లు అందజేశారు. పార్టీ ఆదేశాల మేరకు బీజేపీ అభ్యర్థి పాల్వాయి హరీష్‌కు తమ పూర్తి మద్దతు తెలిపారు. పాల్వాయి హరీష్ సతీమణి శివాణి పాల్గొని పండ్లు, నీళ్ల బాటిల్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాగజ్‌నగర్ నుంచి టోంకిని ఆలయం వరకు ప్రధాన రహదారి కంకరతేలడం భక్తులు కాలినడకన తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాగజ్‌నగర్ నుంచి పాదయాత్ర చేస్తూ వెళ్లే భక్తులకు ఉపశమనం కలిగించేలా ఈ కార్యక్రమం నిర్వహించామని, పవన్ కళ్యాణ్ సేవా స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని సేవాకార్యక్రమాలను చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సిర్పూర్ నియోజకవర్గ అభ్యర్థి పాల్వాయి హరీష్ సతీమణి శివాణి, జనసేన నాయకులు పోతుల ప్రవీణ్, అంకర్ శ్రీనివాస్, వినేష్‌రెడ్డి, తౌటి ప్రభాకర్, తౌటి అఖిల్, పెరుగు మనీష్, చిట్టి రాజేష్ పాల్గొన్నారు.



భారీ మెజార్టీతో వివేక్‌ను గెలిపించాలి

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

చెన్నూరు నియోజకవర్గం క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో నాగార్జున కాలనీలో మంగళవారం కాంగ్రెస్ భారీ ర్యాలీ నిర్వహించారు. మహిళలు నృత్యాలు చేస్తూ ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ చేయి గుర్తుకు ఓటేసి వివేక్ వెంకటస్వామిని భారీ మెజార్టీతో గెలిపించాలని గడప గడపకు తిరుగుతూ కాంగ్రెస్ ఆరు గ్యారంటీలపై ఓటర్లకు వివరిస్తూ, ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు మల్లేష్, చంద్రగిరి రమేష్ పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం

నవతెలంగాణ-లక్సెట్టిపేట

అభివద్ధి, సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఆ పార్టీ మంచిర్యాల ఎమ్మెల్యే అభ్యర్థి కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని ఎల్లారం, కొత్తూరు, పాతకొమ్ముగూడెం, కొత్త కొమ్ముగూడెం, హనుమంతుపల్లి, సూరారం గ్రామాలలో పార్టీ శ్రేణులతో సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో పలువురు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలను ప్రజలకు వివరించారు. ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేసిన ఘనత కాంగ్రెస్‌కే ఉందని, అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కాంగ్రెస్‌తోనే అని, మంచిర్యాల నియోజకవర్గ అభివృద్ధి కోసం ఒకసారి అవకాశం ఇవ్వాలని, అభివద్ధి అంటే ఏమిటో చూపిస్తానని ప్రతి ఒక్కరూ నవంబర్ 30 న జరుగనున్న శాసనసభ ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటు చేసి తనను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పింగిలి రమేష్, మండల నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బాల్క సుమన్ ఆహ్వానం మేరకు బీజేపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పత్తి శ్రీనివాస్ ఇటీవల కేసీఆర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రస్తుత ఎన్నికల్లో బీఆర్ఎస్ చెన్నూర్ ఎమ్మెల్యే అభ్యర్థి బాల్క సుమన్ గెలుపే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. దీంతో మంగళవారం పత్తి శ్రీనివాస్ ఆధ్వర్యంలో క్యాతనపల్లి మున్సిపాలిటీలోని 8వ వార్డు, ఇందారం గ్రామ పంచాయతీల నుంచి బీజేపీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి భేద లక్ష్మణ్, సుమారు రెండు వందల మంది యువకులు బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి బాల్క సుమన్ బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పత్తి శ్రీనివాస్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో కష్ట జీవులకు, కార్పొరేట్ శ్త్రులకు, ఉద్యమకారులకు, ఉద్యమ ద్రోహులకు, బడుగు బలహీనర్గాల పక్ష పాతికి సామంత రాజులు కొమ్ము గాచే మధ్య జరుగుతున్న ఎన్నికల్లో బడుగు బలహీన వర్గాల పక్ష పాతి బాల్క సుమన్ కారు గుర్తుకు ఓటు వేసి అధికమెజారిటీతో గెలిపించాలని యువతకు పిలుపునిచ్చారు.

పాఠశాలలో ఉచిత వైద్యశిబిరం

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని కోపగూడ, వెల్గీ ఆశ్రమ పాఠశాలలలో మంగళవారం ఆరోగ్య విస్తరణ అధికారి రవిదాస్ వైద్యశిబిరం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, అంటు వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో కెమోఫోస్ దోమల మందును పిచికారి చేశారు. అనంతరం పాఠశాలల విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-నస్పూర్

ఎన్నికల విధులు నిర్వహిస్తున్న అధికారులు, అత్యవసర సేవలు అందిస్తున్న వారు, భారత ఎన్నికల సంఘంచే జారీ చేయబడిన పోలింగ్ అథారిటీ పాస్లు పొందనున్న ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు శాసనసభ నియోజకవర్గ ఎన్నికల సందర్భంగా కల్పించిన పోస్టల్ బ్యాలెట్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి బదావత్ సంతోష్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని 004-మంచిర్యాల నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, మంచిర్యాల రాజస్వ మండల అధికారి రాములుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 30న జరుగనున్న పోలింగ్ రోజున అర్హత గల ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎన్నికలలో భాగంగా జిల్లాలో 002-చెన్నూర్, బెల్లంపల్లి, మంచిర్యాల నియోజకవర్గాలలో సహాయక పోలింగ్ కేంద్రాలను కలుపుకొని మొత్తంగా 743 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకొని అర్హత గల వారు తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని తెలిపారు.

అధికారంలోకి వస్తే ఆరు గ్యారెంటీలు అమలు చేస్తాం

నవతెలంగాణ-జన్నారం

తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 6 గ్యారంటీ స్కీములను తప్పకుండా అమలు చేస్తామని కాంగ్రెస్ ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి వెడ్మ బొజ్జు అన్నారు. మంగళవారం మండలంలోని కవ్వాల్ దేవుని గూడా చర్లపల్లి, తదితర గ్రామాల్లో విశితంగా ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వాడవాడకు తిరుగుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పిస్తామన్నారు. 500కే సిలిండర్ అందిస్తామన్నారు. తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి రూ.పది లక్షల వరకు భీమా అందిస్తామన్నారు. ప్రతి గృహిణికి రూ.2500 అందిస్తామన్నారు. రెండు లక్షల వరకు రుణమాఫీ చేస్తామన్నారు. ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరించి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు ముజాఫర్ అలీ ఖాన్, ప్రధాన కార్యదర్శి మాణిక్యం, జిల్లా నాయకులు గుర్రం మోహన్‌రెడ్డి, ఏనుగు సుభాష్‌రెడ్డి, మత్స్య శంకరయ్య, పసియుల్లా, కరుణాకర్, మామిడిపల్లి ఇందయ్యా దుమల రమేష్, తిరుపతి రాజన్న, ఆయా గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-భీమారం

మండలంలో విద్యుత్ సరాఫరాలో బుధవారం అంతరాయం ఏర్పడుతుందని ఏఈ కుమార స్వామి మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. భీమారం సబ్‌స్టేషన్‌కు వచ్చే లైన్‌కు ప్రత్యామ్నాయంగా నూతన 33 కేవీ విద్యుత్ లైన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనులు జరుగుతున్న క్రమంలో సబ్‌స్టేషన్ పరిధిలో గల గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.